PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 130 | విజయవాడ, గురువారం 12 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 12 December 2024 | Rs

పక్షపాత ధోరణితో జగదీప్ ధన్‌ఖర్

- నిబంధనలకు విరుద్ధగా రాజకీయాలతో సభ నడుపుతున్నారు
- అందుకే ఆయనను తొలగించేందుకు అవిశ్వాసం
- విలేకరుల సమావేశంలో ప్రతిపక్షాలు

7

మంధాన సెంచరీ వృధా

చివరి వన్డేలోనూ ఆస్ట్రేలియా మహిళల చేతిలో చిత్తు

8

అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఫొటోలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తదితరులు

సేవకుల్లా పనిచేయండి

మాది పొలిటికల్ గవర్నెన్స్ • 15శాతం వృద్ధిరేటు లక్ష్యం

• జిల్లాల సమగ్రాభివృద్ధికి చొరవ చూపాలి • కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు దిశా నిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికారుల్లా కాకుండా ప్రజా సేవకుల్లా పని చేయాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో వివిధ శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను, లక్ష్యాలను వివరించారు. ప్రజా ప్రతినిధులు కలెక్టర్ల దృష్టికి తీసుకొచ్చే సమస్యలకు ప్రాధాన్యమిచ్చి వెంటనే పరిష్కరించాలని అన్నారు. 'మాది పొలిటికల్ గవర్నెన్స్ .. ప్రతి సమస్యను పరిష్కరించాల్సిందే. ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కారం కావాలి. ఈ విషయంలో రాజీ లేదు' అని చెప్పారు. 'వచ్చిన అర్జీలను ఆర్‌డిఓకో, తహసిల్దార్‌కో పంపితే సమస్య పరిష్కారమైనట్లు కాదు. సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలి. ప్రజల్లో సంతృప్తస్థాయి తగ్గుతోందంటే ఆలోచించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.' అని చెప్పారు. ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెటుకుని పని చేయాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల్లో అత్యధికంగా 60శాతం భూ సంబంధితమైనవే ఉంటున్నాయని, అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి దాని స్థానంలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్టును తీసుకొచ్చినట్లు తెలిపారు. పాలనలో కూడా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రావాలని, ప్రభుత్వ నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేయని వాళ్లతో పనిచేయించాలని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.31వేల కోట్లు సమకూర్చామని, 2027నాటికి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు.

'వారి'ని క్షమించొద్దు...

ఎపి బ్రాండ్‌ను దెబ్బతీసిన వారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ క్షమించవద్దని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వంలో భూ అక్రమాలు, లిక్కర్ మాఫియా, ఇసుక దోపిడీ, గంజాయిసాగు, డ్రగ్స్ సరఫరా, ఎర్రచందనం స్మగ్లింగ్, రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా ఇలా అన్ని రంగాల్లోకి మాఫియా చొచ్చుకుపోయిందని, దానిని కూకటి వేళ్లతో సహా పెకిలించి వేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని చెప్పారు. 'ఎక్కడా గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించకూడదు' అని అనారు. విశ్వసనీయతను, నమ్మకాన్ని తిరిగి నిలబెట్టి రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని మిగతా 7లో

మూడు చెక్ పోస్టులు పెట్టినా బియ్యం స్మగ్లింగా! : పవన్‌కల్యాణ్

కాకినాడ పోర్టులో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించినా బియ్యం స్మగ్లింగ్ యథేచ్ఛగా జరుగుతోందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. సమావేశానికి హాజరైన కలెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్, ఎస్‌పిలకు లేదా అని ప్రశ్నించారు. స్మగ్లింగ్ జరుగుతున్న తీరును చూసి తాను షాకైనట్లు ఆయన తెలిపారు. ఇదే మాదిరి కొనసాగితే తీవ్రవాద మూకలు, పేలుడు పదార్థాలు సులభంగా దేశంలోకి రావడానికి ఆస్కారం ఉందని చెప్పారు. 2008లో ఉగ్రవాదులు ముంబై పోర్టు నుండి దేశంలోకి వచ్చి చేసిన దాడిని ఆయన గుర్తుచేశారు. కాకినాడ పోర్టు భద్రంగా లేకపోతే అలాంటివి జరగవనే గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. వ్యవస్థల్లో చాలా నిర్లక్ష్యం పేరుకుపోయిందని, దీన్ని పూర్తిగా తొలగించాలని అన్నారు. ప్రజల మేలు కోసం రాష్ట్రం బాగు కోసం సమిష్టిగా పనిచేద్దామని అధికారుల నుద్దేశించి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తీరు చూస్తే ఆశ్చర్యంగా ఉండేదని చెప్పారు. క్షేత్రస్థాయిలో తప్పులను నియంత్రించే బాధ్యత కార్యనిర్వాహక వర్గానిదేనని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేసే వారికి ప్రభుత్వ మద్దతు ఉంటుందన్నారు.

విశాఖలో వ్యూహాత్మక పెట్టుబడులకు

గూగుల్‌తో ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గూగుల్ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు అమరావతిలో సిఎం నారా చంద్రబాబునాయుడు, ఐటి శాఖ మంత్రి లోకేష్ సమక్షంలో గూగుల్ ప్రతినిధులు, ఎపి ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎంఒయుపై బుధవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో దేశ ఐటి రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో గూగుల్ ప్రతిపాదిత పెట్టుబడులను స్వాగతిస్తున్నామ న్నారు. పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్రంలో పటిష్టమైన ఎకోసిస్టమ్ ఏర్పాటవుతుందని తెలిపారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన కొద్దినెలలకే ఆర్సెలర్స్ మిట్టల్, నిప్పన్ స్టీల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, భారత్ ఫోర్డ్‌తో సహా పలు భారీ పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. తన యుఎస్ పర్యటనలో గూగుల్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో జరిగిన చర్చలు ఫలవంతం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గూగుల్ గ్లోబల్ నెట్ వర్కింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే విశాఖపట్నంలో ప్రతిపాదించిన వ్యూహాత్మక పెట్టుబడుల ప్రణాళికలను ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు వివరించారు. ఈ నెల 5వ తేదీన గూగుల్, ఎపి ప్రభుత్వం మధ్య ఎఐ ఇనిషియేటివ్‌లలో సహకరించడానికి ఎంఒయుపై సంతకం చేశామని, మలివిడతగా తమ బృందం దేశంలో గూగుల్ కార్యకలాపాలు, దాని భవిష్యత్తు ప్రణాళికలపై ఒప్పందానికి ఎపికి వచ్చినట్లు చెప్పారు. ఎపి తమకు కీలక భాగస్వామ్య రాష్ట్రమని బికాష్ కోలే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో పెద్ద ఎత్తున ఐటి పెట్టుబడులను ఆకర్షించడంతో గణనీయమైన ఆర్థిక, సామాజిక వృద్ధిని సాధించారని, అదేవిధంగా ఇప్పుడు ఎపిలో ఐటి పరిశ్రమ అభివృద్ధి సాధించగలదన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ కార్య దర్శి యువరాజ్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి టెన్త్

- పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్, పదోతరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యాయి. ఈ రెండు పరీక్షల టైమ్ టేబుళ్లను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో వేర్వేరుగా బుధవారం విడుదల చేశారు. విద్యార్థులు ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టడానికి, సరిగ్గా ప్లాన్ చేసుకునేందుకు ఇదే సరైన సమయమని మంత్రి లోకేష్ తెలిపారు. ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ మంచి ఫలితాలు సాధించేందుకు ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులకు ఒత్తిడి తగ్గించేలా రోజు విడిచి రోజు పరీక్ష ఉండేలా ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులందరికీ ఈ సందర్భంగా ఆల్‌ది బెస్ట్ తెలిపారు. 2025 మార్చి ఒకటి నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి ఒకటి నుంచి 19 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 3 నుంచి 20 వరకు జరుగుతాయి. ఇద్దరికీ కూడా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ విద్యా ర్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు జరుగుతాయి. వొకేషనల్ విద్యార్థులకు 22వ తేదీ ఉదయం పూట నిర్వహించనున్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమాన్ వాల్యూస్ పరీక్ష ఫిబ్రవరి ఒకటి, పర్యావరణ విద్య పరీక్ష 3న నిర్వహిస్తారు. మార్చి 17 నుంచి 31 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు గతేడాదిలాగే ఏడు పేపర్లలో ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్వ హించనుంది. ఇంటర్ పరీక్షలకు సుమారు 10 లక్షల మంది, పదో తరగతి పరీక్షలకు సుమారు ఆరు లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

టైమ్ టేబుల్స్ 2

రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు జాతీయ పతాకం అందజేస్తున్న రాహుల్ గాంధీ

జాతీయ జెండాలతో ప్రతిపక్షాల వినూత్న ఆందోళన

- రాజ్‌నాథ్‌కు జెండా, గులాబీ అందచేసిన రాహుల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై చర్చ కోసం పట్టుపడుతున్న ప్రతిపక్షాలు బుధవారం వినూత్న రీతిలో ఆందోళన నిర్వహించాయి. పార్లమెంటు ఆవరణలో నిల్చొని సభకు హాజరవుతున్న బిజెపి ఎంపిలకు త్రివర్ణ పతాకం, గులాబీలు అందించారు. ఆ సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అక్కడకు రావడంతో రాహుల్ గాంధీ గబగబా వెళ్లి ఆయన చేతికి త్రివర్ణ పతాకం, గులాబీ ఇచ్చి తన నిరసన తెలిపారు. 'అదానీ' అంశంపై పార్లమెంటులో చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే, కాంగ్రెస్–సోరోస్ సంబంధాలను తీసుకొచ్చి సభా కార్యక్రమాలను సాగనీయకుండా బిజెపి అడ్డుపడుతోందని ప్రతిపో నేతలు విమర్శించారు.

ప్రతిపక్షాల ఆందోళనల నడుమ రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ప్రతిపక్ష ఎంపిల ఆందోళనల మధ్య రైల్వే సవరణ బిల్లును లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టిన రైల్వే సవరణ బిల్లును శీతాకాల సమావేశాల్లో ఆమోదించారు. ఈ బిల్లు చట్టంగా మారితే రైల్వేల ప్రైవేటీకరణకు దారితీస్తుందని ప్రతిపక్ష పార్టీల ఎంపిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లుతో రైల్వేల ప్రైవేటీకరణ జరగదని, రైల్వే బోర్డు పనితీరు మిగతా 7లో

ఎటిఎంల ద్వారా ఇపిఎఫ్ సొమ్ము విత్‌డ్రాలు

- జనవరి నుంచి అమలు

న్యూఢిల్లీ : ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) ఖాతాదారులు ఇకపై విత్‌డ్రాలను ఎటిఎంల ద్వారా నిర్వహించుకోవచ్చని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. జనవరి నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. ఖాతాదారుల ఈజీ ఆఫ్ లివింగ్ (జీవన సౌలభ్యం)ను మరింత మెరుగుపరచడానికి ఇపిఎఫ్ఐ నిధుల ఉపసంహరణ ప్రక్రియను సులభతరం చేయడానికి కృషి చేస్తామన్నారు. దీంతో ఒక హక్కుదారుడు, లబ్ధిదారుడు లేదా బీమా చేయబడిన వ్యక్తి తమ తమ క్లెయిమ్‌లను తక్కువ మానవ ప్రమేయంతో పరిష్కరించుకోగలరు. ఎటిఎంల ద్వారా నిధులను ఉపసంహరించుకోగలరు' అని తెలిపారు. అదేవిధంగా గిగ్ కార్మికుల సామాజిక భద్రతా ప్రయోజనాలను రక్షించే ప్రణాళికల గురించి వివరిస్తూ ఈ ప్రక్రియ వేగంగా ముందుకు వెళుతుందని చెప్పారు. 'దీనిపై కసరత్తు పూర్తి చేశాం. రూపొందించిన పథకం తుది దశలో ఉంది' తెలిపారు. ఇపిఎఫ్ఒ ప్రస్తుతం ఏడు కోట్ల మందికి పైగా క్రియాశీల కంట్రిబ్యూటర్లు ఉన్నారు. వీరికి సేవలను విస్తరించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఈ ఇంటర్వ్యూలో దావ్రా వివరించారు. ఇపిఎఫ్ఒ వద్ద ప్రస్తుతం రూ. 24.75 లక్షల కోట్ల నిధులు ఉన్నాయి.

కేరళపై కేంద్రం వివక్ష

రాష్ట్రాల హక్కులపై దాడి

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి అండగా నిలవాలి

సంఘీభావ సభలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

సంఘీభావ సభలో మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేరళలోని వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని, అటువంటి రాష్ట్రంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కత్తిగట్టినట్టు వ్యవహరించడం దారుణమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శించారు. కేరళ వామపక్ష ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర ప్రజలకు మద్దతుగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ఆధ్వర్యాన సంఘీభావ సభ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విజూ కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో ప్రత్యామ్నాయ విధానాలతో కేరళ ముందుకు సాగుతోందన్నారు. అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు, కనీస వేతనాలు, భూ పంపిణీ, పౌరసరఫరాల వ్యవస్థ, రైతు పంటకు మద్దతు ధర, కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఎనిమిది రకాల కూరగాయల పంటలతో సహా అన్ని పంటలకూ మద్దతు ధరలు ఇచ్చి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా పేరుతో ఇటీవల రైతులకు సహాయం చేస్తోందని, కానీ కేరళలో మొదటి నుంచి పంచాయతీల ద్వారా రూ.32 వేలు ఆర్థిక సహాయం రైతులకు అందిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనం రూ.700, అసంఘటిత కార్మికులకు వెయ్యి రూపాయల కనీస వేతనం అమలు చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.14 వేల వేతనాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఎయిర్‌పోర్టును ప్రైవేట్‌వారికి కాకుండా తమకు అప్పగించాలని కేరళ ప్రభుత్వం కోరినా కేంద్రం నిరాకరించిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కేరళకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోతలు విధిస్తుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్తంభింపజేయడం వల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు మిగతా 7లో

పెరిగిన విద్యుత్ బిల్లులు దహనం చేయండి

- ప్రజలకు వి శ్రీనివాసరావు పిలుపు
- స్వర్ణాంధ్రకు బదులు అదానీ ఆంధ్రను నిర్మిస్తున్నారా?

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపుతూ స్వర్ణాంధ్ర నిర్మాణం అని చెప్పడం హాస్యాస్పదమని, ఈ భారాలను నిరసిస్తూ ప్రజలు ఎక్కడికక్కడ విద్యుత్ బిల్లులను దహనం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం విశాఖలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు, నారా లోకేష్ పిలుపు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక దుడ్డు కర్రతో ప్రజలపై బాదుడుకు దిగారని వివరించారు. ట్రూ అప్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ ఛార్జీలను వడ్డిస్తున్నారని తెలిపారు. అసలు కంటే కొసరే అధికంగా జనంపై పడుతోందన్నారు. అక్టోబర్‌లో రూ.386 బిల్లు వచ్చిన ఓ వినియోగదారునికి నవంబర్‌లో పది యూనిట్లు తగ్గినా రూ.503 కరెంట్ బిల్లు రావడం దారుణం కాదా? అని ప్రశ్నించారు. విశాఖలో ఒక చిరు వ్యాపారి దుకాణానికి గత నెలలో రూ.600 బిల్లు వస్తే, ఈ నెలలో రూ.1,190 వచ్చిందని, 40 శాతం పైచిలుకు పెరుగుదల ఉందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతామని చెప్పిన చంద్రబాబు... ఆ పని చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వ్యతిరేకించారని గుర్తు చేశారు. అధికారంలో లేనప్పుడు ఒకమాట.. అధికారంలోకి వచ్చాక ఇంకొకమాట మాట్లాడడం సరికాదన్నారు. ఈ భారాలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అదానీతో ఒప్పందాలను ఎందుకు రద్దు చేయడం లేదు?

అదానీతో సెకీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ ముడుపులతో కూడిన ఒప్పందాలని తేలినందున వాటిని ఎందుకు రద్దు చేయడం లేదని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. గత ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందాలను అప్పట్లో టిడిపి వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రూ.1,750 కోట్లు ముడుపులు ముట్టాయని తెలిసినా, టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. నిత్యం జగన్‌పై ఫైర్ అయ్యే పాలకులు నేడు అదానీతో ఆ వ్యవహారానికి లింకు ఉండడంతో మోడీకి లొంగిపోవడం సిగ్గుచేటన్నారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై అదనంగా లక్ష కోట్ల రూపాయల భారాలు మోపడానికి సిద్ధపడటం దారుణమని పేర్కొన్నారు. అదానీ ఒప్పందాలను అమలు చేస్తోన్న చంద్రబాబు... స్వర్ణాంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నిటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గంగవరం పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

విశాఖ ఉక్కు పరిశ్రమకు గంగవరం పోర్టు సహాయకారిగా ఉంటుందని అప్పట్లో దాన్ని ఏర్పాటు చేస్తే, నేడు అది అదానీపరమై స్టీల్‌ప్లాంట్‌నే మింగేయాలని చూస్తోందని వి.శ్రీనివాసరావు వివరించారు. ప్రభుత్వం వెంటనే గంగవరం మిగతా 7లో

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- ఎపి పిజిసెట్ ర్యాంకర్లకు సన్మానం

3

కార్మిక పోరాట యోధునికి తుది వీడ్కోలు

- ఢిల్లీలో ముగిసిన తివారి అంత్యక్రియలు
- బృందాకరత్, తపన్‌సేన్ ప్రభృతుల నివాళి

7

2027 నాటికి పోలవరం పూర్తి

- జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్

2



ఇజ్రాయిల్ దాడిలో ధ్వంసమైన సిరియాకు చెందిన నౌక

సిరియాలోకి చొచ్చుకెళ్తున్న ఇజ్రాయిల్

- డమాస్కస్‌కి చేరువగా సేనలు
- యుద్ధ విమానాల ద్వారా బాంబుల వర్షం

డమాస్కస్ : అసద్ పతనం తర్వాత అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా చెలరేగిపోతోంది. సిరియాకు చెందిన గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌ను ఇప్పటికే ఆక్రమించుకున్న ఇజ్రాయిల్ సైన్యం ఇప్పుడు డమాస్కస్ దిశగా చొచ్చుకెళ్తోంది. ఇజ్రాయిలీ దళాలు వైమానిక, భూతల దాడులతో సిరియాలో పెద్దయెత్తున విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. గొలాన్ హైట్స్ బఫర్ జోన్‌ను ఆక్రమించుకున్న ఇజ్రాయిల్ చర్యను అరబ్ ప్రపంచం తీవ్రంగా ఖండించింది. 1973 సిరియా, ఇజ్రాయిల్ యుద్ధం (దీనినే అక్టోబర్ యుద్ధం అని కూడా పిలుస్తారు) తర్వాత కుదుర్చుకున్న ఒప్పందంలో ఉభయ దేశాల సరిహద్దుల్లోని గొలాన్‌హైట్స్ ప్రాంతాన్ని బఫర్‌జోన్‌గా ప్రకటించారు. అక్కడ సైనిక సంచారం లేకుండా చూసే బాధ్యతను యుఎన్ డిజెంగేజ్‌మెంట్ అబ్జర్వ్ ఫోర్స్ (యుఎన్‌డిఒఎఫ్) కు అప్పగించారు. యాభై ఏళ్ల క్రితం నాటి ఈ ఒప్పందానికి ఇజ్రాయిల్ నిలువునా తూట్లు పొడుస్తూ, బఫర్‌జోన్‌ను ఆక్రమించుకుంది. సిరియాలోని ఇతర ప్రాంతాలను కూడా ఆక్రమిం చేందుకు అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దాడులను ఉధృతం చేసింది. సిరియా భూభాగం లోకి ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకొస్తున్నాయని సిరియా ప్రతిపక్ష యుద్ధ పర్యవేక్షక సంస్థ తెలిపింది. సిరియా నావికాదళాన్ని మొత్తంగా నాశనం చేశామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించారు. దక్షిణ సిరియాలో నిస్సైనికీకరణ మండలాన్ని ఏర్పాటు చేస్తామని రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ పేర్కొన్నారు. సిరియాలో తీవ్రవాదం వేళ్ళూనుకోకుండా మిగతా 7లో

రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేద్దాం

- మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పలు అంశాలపై సదస్సులో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిఎం చంద్రబాబు సూచనలు, సలహాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారసత్వంగా వచ్చిన ప్రధానమైన సమస్య రూ.10 లక్షల కోట్ల అప్పుని తెలిపారు. మొదటి నెలలో రాష్ట్ర ఆదాయంలో 99 శాతం జీతభత్యాలకే సరిపోయిన పరిస్థితి నెలకొందన్నారు. అంతకుముందు రెండేళ్ళ రాష్ట్ర ఆదాయంలో 107 శాతం జీతభత్యాలకే వెచ్చించిన పరిస్థితి ఉందన్నారు. రూ.1.14 లక్షల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాల్సి వచ్చిందని చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థనూ నిర్వీర్యం చేశారన్నారు. రూ.3 కోట్లు ఖర్చు పెడితే కెసి కెనాల్ పనులు పూర్తయ్యేవని, అలా చేయకపోవడం వల్ల ఐదేళ్లలో కెనాల్ నాశనమైందన్నారు. ఒకవైపు అప్పులు, ఆగిపోయిన ప్రాజెక్టులు, మరోవైపు ప్రజల ఆశలు, ఆకాంక్షలు రెండింటినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రతి రూపాయినీ జాగ్రత్తగా ఆలోచించి ఖర్చు చేయాలని సూచించారు.

టెన్త్ టైమ్ టేబుల్

తేది	సబ్జెక్ట్
17-03-2025	మొదటి భాష (పేపర్-1)
19-03-2025	రెండవ భాష
21-03-2025	ఇంగ్లీష్
22-03-2025	ప్రథమ భాష పేపర్-2 (కంపొజిట్‌కోర్సు) ఒఎస్‌ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్-1
24-03-2025	మేథమెటిక్స్
26-03-2025	ఫిజికల్ సైన్స్
28-03-2025	బయలాజికల్ సైన్స్
29-03-2025	ఒఎస్‌ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్-2 ఎస్‌ఎస్‌సి వొకేషనల్ కోర్సు
31-03-2025	సోషల్ స్టడీస్

ఇంటర్ టైమ్ టేబుల్

మొదటి సంవత్సరం

తేది	సబ్జెక్ట్
1-03-2025	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 (శనివారం)
4-03-2025	ఇంగ్లీష్ పేపర్-1 (మంగళవారం)
6-03-2025	మేథమెటిక్స్ పేపర్-1ఎ బోటనీ పేపర్-1 సివిక్స్ పేపర్-1
8-03-2025	మేథమెటిక్స్ పేపర్-1బి జువాలజీ పేపర్-1 హిస్టరీ పేపర్-1
11-03-2025	ఫిజిక్స్ పేపర్-1 ఎకనామిక్స్ పేపర్-1
13-03-2025	కెమిస్ట్రీ పేపర్-1 కామర్స్ పేపర్-1 సోషియాలజీ పేపర్-1 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1
17-03-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ పేపర్-1 లాజిక్ పేపర్-1 బ్రిడ్జ్ కోర్సు మేథ్స్ పేపర్-1
19-03-2025	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1 జియోగ్రఫీ పేపర్-1

ద్వితీయ సంవత్సరం

తేది	సబ్జెక్ట్
03-03-2025	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
5-03-2025	ఇంగ్లీష్ పేపర్-2
7-03-2025	మేథమెటిక్స్, పేపర్-2ఎ బోటనీ పేపర్-2 సివిక్స్ పేపర్-2
10-03- 2025	మేథమెటిక్స్ పేపర్-2బి జువాలజీ పేపర్-2 హిస్టరీ పేపర్-2
12-03-2025	ఫిజిక్స్ పేపర్-2 ఎకనామిక్స్ పేపర్-2
15-03-2025	కెమిస్ట్రీ పేపర్-2
	కామర్స్ పేపర్-2 సోషియాలజీ పేపర్-2 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
18-03-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ పేపర్-2 లాజిక్ పేపర్-2 బ్రిడ్జ్ కోర్సు మాథ్స్ పేపర్-2
20-03-2025	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2 జియోగ్రఫీ పేపర్-2

అవి ఆదాయ పాలసీలు

- అమలు చేసి తీరాలి
- సిఎం చంద్రబాబు
- అధికారుల గందరగోళ సమాధానాలు

కలెక్టర్ల సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ పాలసీలను క్షేత్రస్థాయిలో అమలు చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కలెక్టర్ల సదస్సు ప్రారంభ కార్యక్రమం అనంతరం బుధవారం ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలసీలను ప్రస్తావించిన ఆయన అవి ఆదాయ మార్గాలకు కొత్త రూపం ఇస్తాయని తెలిపారు. వాటి అమలుతో ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, అమల్లో జాప్యం జరిగితే అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నలకు కొందరు అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. కొందరు తడబాటుకు గురయ్యారు. దీంతో సిఎం కొంత అసహనం వ్యక్తం చేశారు. అస్పష్టతతో సమావేశాలకు రావొద్దని, ఖచ్చితమైన సమాచారంతో రావాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడంతోపాటు, దానికి అవసరమైన ప్రణాళికలు ఎలా అమలు చేయాలనే అంశంపై సిఎం పలు సూచనలు చేశారు.

ఉచిత సిలిండర్లు, ఐదు కిలోల సిలిండర్లకు సంబంధించి సిఎం అడిగిన ప్రశ్నకు సంబంధిత అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను అక్కడే ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ సిఎంకు సమర్పించారు. అధికారులు వరుస తడబాట్లతో సిఎం కొంత అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పూర్తిగా మారాలని, ప్రభుత్వం నిర్ణయాలను తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు. రెండోసారి జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో ఎక్కువమంది అధికారులు సరైన సమాచారం లేకుండానే రావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. రెండోరోజు సమావేశాల్లో అయినా సరైన సమాధానాలు ఇవ్వాలని సూచించారు.

50 లక్షల మంది సమాచారం లేదు

రాష్ట్రంలో 50 లక్షలమంది సమాచారం ప్రభుత్వం వద్ద లేదని అధికారులు తెలిపారు. 5.4 కోట్ల మంది జనాభా ఉంటే 4.9 కోట్ల మంది వివరాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. పురపాలక, రెవెన్యూ, రవాణా, విద్యుత్, పంపిణీ సంస్థలకు చెందిన వివిధ శాఖల్లో వీరి సమాచారం లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్లు దృష్టి పెట్టి జనవరి 31లోపు అన్ని వివరాలూ సమర్పించాలని సిఎం అన్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో పౌరుల వివరాలను అనుసంధానించాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేయాలని, గ్రామాలు రిహాబిలిటేషన్ల వారీగా కుటుంబాల మ్యాపింగ్ చేయాలని సిఎం సూచించారు.

ఎఐ కాదు డీప్‌టెక్

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తావించారు. ఇప్పటి వరకూ ఎఐ గురించి మాట్లాడుతున్నామని, ఇక నుండి డీప్‌టెక్ గురించి మాట్లాడుకోవాలని తెలిపారు. గూగుల్ లాంటి సంస్థలు వస్తే అది పెద్ద పనికాదని వివరించారు.

సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ తదితరులు

ప్రజా సమస్యలను సులభంగా వీక్షించే సదుపాయం

- ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లాల్లో ప్రజాసమస్యలపై అన్ని మాధ్యమాల్లో వచ్చే సమాచారం మొత్తం కలెక్టర్లు సులభంగా వీక్షించగలిగే సదుపాయాన్ని కల్పిస్తున్నామని పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ సమాచారాన్ని విశ్లేషించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, పథకాల అమలు తీరుపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు రైతుల ఖాతాలకు జమ చేయడం వల్ల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం ఇచ్చిన రైతుల్లో 94.16 శాతం మందికి 48 గంటల్లో చెల్లింపు జరిగిందని, 91.60 శాతం మంది రైతులకు ధాన్యం నాణ్యతకు తగ్గ ధర లభించినట్లు చెప్పారన్నారు. ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారని 87 శాతం మంది తెలిపారని పేర్కొన్నారు. పేదలకు పింఛను, రేషను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రభావితం చేసే 10 అంశాలను గుర్తించామని, ఈ అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్లందరూ ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. జిఎస్‌డిపిలో వ్యవసాయ వాటా మరింత పెరగాలని, రైతులకు ఎరువులు సకాలంలో అందించాలని చెప్పారు. మొబైల్ అత్యంత ప్రధానమైందని, వాట్సాప్‌ను ప్రణాళికాబద్ధంగా ఎలా వాడాలో తెలుసుకోవాలని సూచించారు. ఆర్‌టిసి బస్సులు ఆలస్యంగా వస్తే ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు.

దారిద్ర్య రేఖకు దిగువన 22 లక్షల మంది

- ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల ఫలితంగా జనాభాలో 4 శాతం... అంటే 22 లక్షల మంది మాత్రమే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ తెలిపారు. సచివాలయంలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌పై వివరిస్తూ.. నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం పేదల అభ్యున్నతికి తగు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పి-4 మోడల్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని రూపొందించేందుకు సంబంధిత శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నామన్నారు. 2014-19 మధ్య కాలంలో జిఎస్‌డిపి 13.50 శాతం ఉంటే, 2019-24 మధ్య కోవిడ్, ఇతర సమస్యల వల్ల అది 10.59 శాతానికి పడిపోయిందని చెప్పారు. స్వర్ణాంధ్ర 2047 మైలురాయి సాధించడానికి 15 శాతం వార్షిక వృద్ధిని సాధించడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఈ వృద్ధిని సాధించడానికి మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం వివిధ విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఐదేళ్ల విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడానికి పలు పాలసీలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. వేగవంతమైన సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించే ప్రాజెక్టులను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోయే విజన్ మేనేజ్‌మెంట్ యూనిట్లు (విఎంయు) విజన్ ప్లాన్‌లను విజయవంతంగా పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విజన్ ప్లాన్‌లపై చర్చ, మార్గదర్శకత్వం కోసం శాఖల వారీ అకడమిక్ నిపుణుల బృందాలను నియమించి జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని ప్రతిపాదించారు.

ఇండస్ట్రియల్ క్లస్టర్లకు 1.13 లక్షల ఎకరాలు

- ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో 64,245 ఎకరాలు
- కలెక్టర్ల సమావేశంలో నివేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా 1,13,608 ఎకరాల్లో భూముల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో 64,245 ఎకరాలు ఉండగా, మరో 67,363 ఎకరాలు సేకరించాల్సిఉంది. ఈ మేరకు కలెక్టర్ల సమావేశంలో నివేదికను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మిగిలిన భూమిని ఏ పద్ధతుల్లో సేకరించాలన్న విషయమై చర్చ జరగనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో మొత్తంగా 30 ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఈ నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద 4,691 ఎకరాలు, సంతబొమ్మాళి వద్ద 3,334 ఎకరాలు అవసరమని పేర్కొంది. దీనిలో సంతబొమ్మాళి వద్ద భూమి ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉంది. మూలపేటలో పూర్తిగా తీసుకోవాల్సి ఉంది. అలాగే అనకాపల్లి జిల్లా చోడవరంలో 39,18 ఎకరాలకుగాను 336 ఎకరాలు పొజిషన్లో ఉంది. మిగిలిన భూమిని సేకరించాల్సిఉంది. అలాగే రాంబిల్లి వద్ద 396 ఎకరాలకు గాను 336 ఎకరాలు అవసరం ఉంది. స్టీలు క్లస్టర్‌కు 2,264 ఎకరాలు అవసరమని ప్రతిపాదించగా అందులో 2,081 ఎకరాలు అందుబాటులో ఉందని ఇంకా 108 ఎకరాలు అవసరం ఉందని పేర్కొంది. ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీని 1,200 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు.

మళ్లీ వాన్‌పిక్

బాపట్ల జిల్లాలో వాన్‌పిక్ ప్రాజెక్టును మరలా ముందుకు తీసుకొచ్చారు. దీనికోసం 1,200 ఎకరాల భూములు అవసరం ఉందని పేర్కొన్నారు. 5,675 ఎకరాల్లో మరలా వాన్‌పిక్(వాడరేవు అండ్ నిజాంపట్నం పోర్టు అండ్ ఇండస్ట్రియల్ కారిడార్) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 6,500 ఎకరాల్లో మచిలీపట్నం పోర్టు, 2,621 ఎకరాల్లో ఓర్వకల్లు హెచ్‌బిఐసి ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రకాశం జిల్లా దొనకొండలో 25,063 ఎకరాల్లో డిఎంఐహెచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకూ 2,396 ఎకరాలు అందుబాటులో ఉండగా ఇంకా 22,667 ఎకరాలు తీసుకోవాలి ఉందని పేర్కొన్నారు. పామూరులో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ఎన్‌ఐఎంజెడ్)కు 12,034 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదించగా ప్రస్తుతం 1,839 ఎకరాలు ప్రభుత్వం వద్ద ఉందని, మిగిలిన భూమిని తీసుకోవాలని ప్రతిపాదించారు. కడపలో 3,636 ఎకరాల్లో ఎపి హైగ్రేడ్ స్టీల్‌ను ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా కొప్పర్తిలో 2596 ఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. తిమ్మసముద్రంలో 1,023 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. 4,827 ఎకరాల్లో రామాయపట్నం పోర్టు, కావలిలో 2,820 ఎకరాల్లో ఎంఐహెచ్ ఏర్పాటుకు ప్రతిపాదించగా మొత్తం భూమిని తీసుకోవాల్సి ఉంది. 537 ఎకరాల్లో కొత్తపట్నంలో కెపిఐఎల్‌సి ఏర్పాటు చేయనున్నారు. 8,844 ఎకరాల్లో చిలమత్తూరు, లేపాక్షి కారిడార్, మడకశిరలో 1,649 ఎకరాల్లోనూ, కోసలనగరంలో 5,573 ఎకరాల్లోనూ, కుప్పంలో 3,044, పుంగనూరులో 2,944, పలమనేరులో 2,088, శ్రీకాళహస్తిలో 10,608, 2,628 ఎకరాల్లోనూ వేర్వేరుగా పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు కృష్ణపట్నం ఇన్‌ఫ్రాకు 4731 ఎకరాలు కేటాయించారు. తిరుపతిలో 2,412 ఎకరాల్లో పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

పట్టణ ప్రాంతాల్లో 765 ఎంఎల్‌డిల నీటి కొరత

- నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 25 జిల్లాల్లో ఉన్న పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని కలెక్టర్ల సమావేశ నివేదిక వెల్లడించింది. అన్ని పట్టణ ప్రాంతాల్లో 2,485.7 ఎంఎల్‌డిల (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉండగా, ప్రస్తుతం 2,010.3 ఎంఎల్‌డిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇంకా 765.1 ఎంఎల్‌డి నీటి కొరత ఉందని నివేదిక వెల్లడించింది. 1,240.5 ఎంఎల్‌డిల నీటి సరఫరాకు సంబంధించిన ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయని పేర్కొంది. పట్టణాభివృద్ధిశాఖకు సంబంధించి ఇచ్చిన నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో 50.2 ఎంఎల్‌డిలకు గాను 28.5 ఎంఎల్‌డిలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పార్వతీపురం మన్యంలో 20 ఎంఎల్‌డిలకు గాను 10.3 ఎంఎల్‌డిలు, అంబేద్కర్ కోనసీమలో 26 ఎమ్‌ఎల్‌డిలకు 18 ఎంఎల్‌డిలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. బాపట్లలో 40 ఎంఎల్‌డిలకు 26 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నీటి వనరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే పట్టణాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రభుత్వం ఇచ్చిన నివేదిక స్పష్టం చేసింది. రాయలసీమ జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. వీటిల్లో నీటి సదుపాయాల కల్పనకు సంబంధించి అమృత్-1 పథకం కింద 32 పట్టణ ప్రాంతాల్లో రూ.2,345 కోట్లతో 52 ప్రాజెక్టులు చేపట్టామని, అవి 75 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. వీటివల్ల 274 ఎంఎల్‌డి కెపాసిటీ నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపింది. ఎఐఐబి నిధులతో 50 అర్బన్ ప్రాంతాల్లో నీటి సదుపాయం కల్పించాలని నిర్ణయించగా, వాటిని 35కు కుదించి రూ.4,747 కోట్లతో పనులు చేపడుతున్నారు. దీనివల్ల 508 ఎంఎల్‌డినీరు అందుబాటులోకి వస్తుంది. అలాగే మరో 38 అర్బన్ ప్రాంతాల్లో రూ.3,883 కోట్లతో పనులు చేస్తున్నారు. ఇవి 12 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇవి కాకుండా అమృత్-2లో 115 అర్బన్ ప్రాంతాల్లో రూ.5,037 కోట్లతో 269 ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించగా అవి మూడుశాతం పూర్తయ్యాయి. మొత్తంగా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నివేదిక పట్టణ ప్రాంతాల్లో నీటి కొరతను స్పష్టం చేసింది. అయితే కొత్తగా చేపట్టే పనుల్లో ఎఐఐబి నిధులతో నిర్మించే ప్రాజెక్టులకు కచ్చితంగా రాబడి ఉండేలా చూడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది.

2027 నాటికి పోలవరం పూర్తి

- జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి జి సాయిప్రసాద్ తెలిపారు. 2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్‌ల వల్ల అనూహ్యంగా వర్షాలు పడ్డాయన్నారు. బుడమేరు ఎగువ ప్రాంతంలో వరదలు సంభవించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ క్లౌడ్ బరస్ట్‌లు ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. వీటిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై దృష్టి సారించినట్లు చెప్పారు. కలెక్టర్లంతా ఉపాధి పనుల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాల్లో అదనంగా నీరు నిల్వ చేయడానికి అవకాశమున్న ప్రాంతాలను అన్వేషించాలని సూచించారు. పులిచింతల డ్యామ్ నిండిందని, ఈ డ్యామ్ నుంచి వచ్చే జూన్‌లోనే ఖరీఫ్ సీజన్‌కు నీళ్ల విడుదల చేస్తామని తెలిపారు. వర్షాలు అధికంగా పడటం వల్ల రాష్ట్రంలో భూగర్భ జలమట్టం పెరిగిందన్నారు.

ప్రజా వినతుల పరిష్కారంపై దృష్టి

- కలెక్టర్లకు సూచించిన సిఎస్ నీరబ్ కుమార్

ప్రజల నుంచి అధిక సంఖ్యలో వినతులు అందుతున్నాయని, వీటిలో ఎక్కువ మొత్తం పెండింగ్‌లో ఉండిపోతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. వినతుల పరిష్కారంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలు సేవలు అందించే విధానాన్ని జిల్లా యంత్రాంగం ఎంతో మెరుగుపరుచుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ఎంతో ముఖ్యమైన పాత్రను జిల్లా స్థాయిలో కలెక్టర్లు పోషించాల్సి ఉందన్నారు. అందుకు తగ్గట్టు క్రియాశీలకంగా కలెక్టర్లు పనిచేయాలని కోరారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కలెక్టర్లు అందరూ అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించేందుకు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహదపడనుందని చెప్పారు. ప్రభుత్వం ఇటీవల కాలంలో రూపొందించిన పలు పాలసీలపై కలెక్టర్లు సమగ్రమైన అవగాహన ఏర్పరచుకోవాలని, వాటిని విజయవంతంగా అమలు చేసే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పనులు పున్ణప్రారంభమైనందున కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయా జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపైన దృష్టి పెట్టాలన్నారు.

సమస్యలు పరిష్కరించలేకపోవడంపై పరిశీలన

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 31,324 అర్జీలు రాగా, అందులో 400 సమస్యలకు పరిష్కారం చూపినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మిగిలిన వాటిని ఎందుకు పరిష్కరించలేకపోయామనే దానిపై కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగం పరిశీలన చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సదస్సుల్లో వస్తున్న ఫిర్యాదులపై అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని, అక్రమాలకు పాల్పడిన అధికారులపైనా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వారసత్వంగా అప్పులు, భూ కబ్జాలు, డ్రగ్స్, మాఫియా వచ్చాయని, వారసత్వంగా వచ్చే భూమిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గత ప్రభుత్వంలో 9.26 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేశారని, అందులో 4.21 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, మొత్తమ్మీద 45 శాతం భూములు కబ్జా చేశారని ఆయన తెలిపారు. భూకబ్జాలకు పాల్పడిన వారందరికీ నూతన చట్టంతో గుణపాఠం చెప్పాలన్నారు. 45 వేల ఎకరాలను గత ప్రభుత్వ పాలకుల అనుయాయులకు అసైన్డ్ చేశారన్నారు.

హెల్మెట్ ధరించక గాలిలో ప్రాణాలు

- హైకోర్టు ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి

హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని వ్యాఖ్యానించింది. పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని తప్పుపట్టింది.

హెల్మెట్ ధరించకపోవడం వల్ల విధించిన చలాన్లు కట్టని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంది. ఇలాంటి వారి ఇళ్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడమో, నీటి సరఫరా ఆపేయడమో వంటి చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడింది. లేదంటే వారి వాహనాన్ని జప్తునకు వీలుందేమో పరిశీలన చేయాలంది. కేంద్ర మోటారు వాహన సవరణ చట్ట నిబంధనలను అమలు చేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉందంటూ న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 8,770 మంది ట్రాఫిక్ పోలీసులు ఉండాల్సి వుంటే.. 1994 మందే ఉన్నారని, ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రం నుంచి తెలంగాణ వెళ్లే వారు తెలంగాణ సరిహద్దులోకి చేరగానే సీటు బెల్ట్, హెల్మెట్ పెట్టుకుంటున్నారని చెప్పింది. మోటారు వాహన చట్ట నిబంధనల అమలు తీరు విషయంలో పోలీసులు, ఆర్‌టిఎ అధికారుల వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) స్వయంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది.

కొనసాగిన రాఘవరెడ్డి విచారణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి విచారణ మూడవ రోజూ కొనసాగింది. బుధ వారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పోలీసులు విచారించారు. పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు తనకు తెలియదనే సమాధానా లను రాఘవరెడ్డి చెప్పినట్లు సమాచారం. ఈనెల 13న మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆయనకు 41ఎ నోటీసులు మరోసారి జారీ చేశారు.

విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వులపై పిల్

ప్రజాశక్తి-అమరావతి : సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి రూ.2.49 పైసలకే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు చేసేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు అనుమతి ఇస్తూ విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్స్‌పై విచారణ వచ్చే నెల 29కు వాయిదా పడింది. టిడిపి నేత, ప్రస్తుత రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విడివిడిగా పిల్స్ దాఖలు చేశారు. సెకీ నుంచి సౌర విద్యుత్ కొనుగోలుపై ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. అదనపు కౌంటర్ వేసేందుకు గడువు కావాలని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. ఇందుకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ అనుమతినిచ్చింది. సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణ రావు వాదిస్తూ.. యూనిట్ రూ.2.49కు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, అదే సెకీ గుజరాత్‌లో యూనిట్ రూ.1.99 కే ఒప్పందం చేసుకుందన్నారు.

పిఎం సూర్యఘర్‌కు 6.39 లక్షల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిఎం సూర్యఘర్ కార్యక్రమంలో ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలకు 6,39,269 మంది వినియోగదారులు వెబ్‌సైట్‌లలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎపిఇపిడిసిఎల్‌కు 4,49,011, ఎపిసిపిడిసిఎల్‌కు 61,670, ఎపిఎస్‌పిడిసిఎల్‌కు 1,28,588 రిజిస్ట్రేషన్లు అందాయి. వీరిలో 77,091 మంది రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసుకోగా, 6,583 మందికి డిస్కమ్‌లు రూఫ్‌టాప్‌లు బిగించాయి. 24,339 కిలోవాట్ల లోడ్ కెపాసిటీతో బిగించాయి. బిగించిన వినియోగదారులకు సబ్సిడీ కింద రూ.25.27 కోట్లు విడుదలయ్యాయి. గురువారం జరిగే కలెక్టర్ల సదస్సులో ఇంధన శాఖలో అమలవుతున్న పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్, ఆర్‌డిఎస్‌ఎస్ పథకాలపై సమీక్ష జరగనుంది.

వరుస క్రమంలో జిఓల అప్‌లోడ్ : హైకోర్టు

అమరావతి : ప్రభుత్వ వెబ్‌సైట్ జిఓ ఐఆర్‌లో జిఓలన్నింటినీ వరుస క్రమంలో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొన్నింటిని అప్‌లోడ్ చేసి మరికొన్నింటిని గోప్యంగా ఉంచడం సరికాదంది. ప్రజలకు అర్థమయ్యేలా ప్రతి జిఓను వరుస క్రమంలో అప్‌లోడ్ చేస్తేనే పారదర్శకంగా ఉంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు తీసుకోబోయే చర్యలు వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గోబెల్స్ ప్రచారంలో భాగంగానే కాకినాడ పోర్టులో హంగామా : జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతినెలా ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం, అదేపనిగా డైవర్షన్ పాలిటిక్స్‌ను సిఎం చంద్రబాబు చేస్తున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ పోర్టు వద్ద హంగామా కూడా ఇందులో భాగమేనన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి వియ్యంకుడు బియ్యం ఎగుమతి చేస్తుంటే ఆయన సరుకు ఎందుకు తనిఖీ చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు బాదుడు వల్ల విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయన్నారు. కేవలం 6 నెలల్లో రూ.15 వేలకోట్లు బాదుడు ప్రారంభించినట్లు చెప్పారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లేదని చెప్పారు. పప్పు బెల్లాల్లా పోర్టులు, మెడికల్ కళాశాలల అమ్మకం చేపట్టారని తెలిపారు. ప్రజలకు అండగా, వారి తరపున పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 13న ధాన్యం సమస్యపైనా, 27న విద్యుత్ ఛార్జీల పెంపుపైనా, జనవరి 3న ఫీజు రీయంబర్స్‌మెంట్‌పైనా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరి నుంచి జిల్లాల పర్యటన చేపట్టనున్నట్లు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీ ప్రతి బుధ, గురువారాల్లో కార్యకర్తలతో మమేకమవుతామన్నారు.

'హాలోగ్రామ్స్' కేసులో ప్రతివాదిగా సిఐడి

ప్రజాశక్తి-అమరావతి

మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హాలోగ్రామ్స్ తయారీ, సరఫరా కాంట్రాక్టు అప్పగింతలో అక్రమాలు జరిగినందున సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిల్‌లో సిఐడిని హైకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఈ వ్యవహారంపై సిఐడి దర్యాప్తు చేస్తున్నందున ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్ కోరడంతో హైకోర్టు అనుమతించింది. విచారణను జనవరికి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హాలోగ్రామ్స్ తయారీ, సరఫరా కాంట్రాక్టు కుంభత్ హాలోగ్రాఫిక్సుకు అప్పగింతలో పలు అక్రమాలు జరిగాయంటూ చెన్నైకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వి శివరామన్ 2021లో పిల్ వేశారు.

'మన్యం' సమగ్రాభివృద్ధికి బలమైన ఉద్యమాలు

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా మహాసభ తీర్మానం

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ మేరకు సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా పదో మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. తద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ, అన్ని సామాజిక తరగతులకూ సమ న్యాయం జరగనుందని మహాసభ పేర్కొంది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణం, రుద్రరాజు సత్యనారాయణరాజు వేదికపై (సాయినందకి కల్యాణ మండపంలో) రెండు రోజులపాటు జరిగిన మహాసభ బుధవారం విజయవంతంగా ముగిసింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మథరావు 'మన్యం జిల్లా సమగ్రాభివృద్ధి' అనే అంశంపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పార్వతీపురం మన్యం జిల్లా అత్యంత వెనుకబాటుకు గురైందని పేర్కొంది. ప్రత్యేక జిల్లాగా ఆవిర్భవించి దాదాపు మూడేళ్లు కావస్తున్నా అభివృద్ధికి ప్రయత్నాలు జరగలేదని, జంఝావతి, అడారు గెడ్డ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, గుమ్మిడిగెడ్డ, జంపర, తాడికొండ, కేదారిపురం, పనసభద్ర, రాళ్లగెడ్డ తదితర జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని మహాసభ డిమాండ్ చేసింది. లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీని, జీగిరాం జ్యూట్ మిల్లును ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడిపించాలని తీర్మానాన్ని ఆమోదించింది. జీడి, చింతపండు, ఇతర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వాటి ప్రాసెసింగ్ యూనిట్లను స్థానికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గిరిజన యూనివర్సిటీని త్వరగా నిర్మించాలని, పార్వతీపురం కేంద్రంగా యూనివర్సిటీ, కురుపాం, పాలకొండ ప్రాంతాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలు, పాలకొండ, సాలూరు ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది. బడిదేవరకొండ, చిన్నగుడబ కొండలపై మైనింగ్ లైసెన్సులను రద్దు చేయాలని, పార్వతీపురం పట్టణానికి రోజూ తాగునీరు అందించాలని, బైపాస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేసింది. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని తీర్మానించింది. ఆక్రమణకు గురైన పేదల స్థలాలను తిరిగి వారికి అప్పగించే వరకు పోరాడాలని నిర్ణయించింది. 50 శాతంపైగా గిరిజనులు ఉన్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, జిఒ 3ను పునరుద్ధరించి గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచాలని, గిరిజనులకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేసింది.

దృఢమైన సంకల్పంతో ప్రజా ఉద్యమాలు : బి.తులసీదాస్

సమస్యలపై దృఢసంకల్పంతో పోరాడి ప్రజా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. మహాసభ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎర్ర జెండాకు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా పనిచేయడం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. జీడిపిక్కలు, చీపుర్లు తదితర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలనే డిమాండ్‌తో నెల రోజుల పాటు కేంద్రీకరించి పనిచేయడం ద్వారా ప్రభుత్వాన్ని కదిలించే పోరాటాలు చేయాలని సూచించారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో పేదలు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యలపై చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలన్నారు.

జిల్లా కార్యదర్శిగా కె.గంగునాయుడు

మహాసభలో సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీ 19 మందితో ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా కొల్లి గంగునాయుడును ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.తిరుపతిరావు, కోలక అవినాష్, వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, కె.రామస్వామి ఎన్నికయ్యారు.

సిఐటియు నాయకులపై ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిందులు

ప్రజాశక్తి - అనంతపురం

సిఐటియు నాయకులపై ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి చిందులు తొక్కారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఉన్న విజయప్రతాప్‌రెడ్డిని బుధవారం సాయంత్రం సిఐటియు నాయకులు కలిసేందుకు వెళ్లారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. సమస్యలు పరిష్కరించే విషయం తన పరిధిలో లేదని.. మీరిలా వచ్చి ఎందుకు తన పనులకు ఆటంకం కలిగిస్తారంటూ చిందులు తొక్కారు. ఛైర్మన్ తీరును శ్రీ సత్యసాయి జిల్లా సిఐటియు నాయకులు హరి, రమేష్, మహబూబ్ బాషా తదితరులు తప్పుబట్టారు.

అంతకుముందు అనంతపురం నగరంలోని ఎస్‌కెడి ప్రైమరీ స్కూల్ పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. రాప్తాడు కెజిబివిని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలు, కెజిబివిలు, హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని, నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం తదితర వాటిపై అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మతో విజయప్రతాప్‌రెడ్డి చర్చించారు.

టిటిడి పరిపాలనా భవనం వద్ద కళాకారులనుద్దేశించి మాట్లాడుతున్న విజయశంకర స్వామి

అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించండి

- అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి
- కళారూపాలతో కార్మికుల శోభాయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమలలో తాళ్లపాక అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించి, హనుమంతుడి విగ్రహాలను ప్రతిష్టించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి డిమాండ్ చేశారు. అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు తిరుపతి సమీపంలోని బిటిఆర్ కాలనీ వద్ద ఉన్న అన్నమయ్య కళాక్షేత్రం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనం వరకూ వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ 'శోభాయాత్ర'గా చేరుకున్నారు. బిటిఆర్ కాలనీ 12వ లైన్‌లో అన్నమయ్య కళాక్షేత్రం వద్ద పునరంకిత ఉత్సవాన్ని తొలుత నిర్వహించారు. విజయ శంకర స్వామి మాట్లాడుతూ.. అన్నమయ్య గృహాన్ని, హనుమంతుడి విగ్రహాలను 2007లో కూల్చివేశారని, తిరుమలలో అన్నమయ్య ఇంటితో పాటు, హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలని కోరుతూ అన్నమయ్య గృహ సాధన సమితి, జయ భారత్ సంస్థలు సంయుక్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 11 లక్షల 50 వేల మంది భక్తుల నుంచి సంతకాలను సేకరించి టిటిడి ఇఒ, ఛైర్మన్‌కు సమర్పించినట్లు తెలిపారు. సంప్రదాయ కళారూపాలు తరిగిపోకుండా గురువులకు టిటిడి నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పాలకమండలి దృష్టికి పై సమస్యలు తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, నూతన పాలకమండలి అయినా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే జనవరి 22న హరినామ సంకీర్తనలతో భక్తి నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం టిటిడి జెఇఒ వీరబ్రహ్మంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ నాయకులు గంగులప్ప, చంద్రశేఖర్ భాగవతార్, వెంకటయ్య, జానపద వృత్తి కళాకారుల సంఘం నాయకులు బంగారు మురళి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పేర్ని భార్యపై కేసు

- బియ్యం గోల్‌మాల్‌పై పౌరసరఫరాల సంస్థ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఫిర్యాదు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధపైనా, పౌరసరఫరా సంస్థ గోదాము మేనేజర్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రయివేట్ గోదాములో పౌరసరఫరాల శాఖ ఉంచిన బియ్యం గోల్‌మాల్ అయినట్లు కృష్ణా జిల్లా బందరు తాలూకా పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. జయసుధ నుంచి పౌరసరఫరాల సంస్థ బందరు మండలం పొట్టపాలెంలో గోదామును లీజుకు తీసుకుంది. బఫర్ గోదాములో ఉంచిన బియ్యం నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు ఆ సంస్థ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పది రోజుల క్రితం గోదాములో నిర్వహించిన తనిఖీల్లో 185 టన్నుల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులుగా పేర్కొంటూ పేర్ని సతీమణి జయసుధ, గోదాము మేనేజర్ మానస తేజలపై ఫిర్యాదు చేశారు. దీంతో, ప్రజలకు చెందాల్సిన బియ్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగపరిచినట్లుగా వారిద్దరిపై పోలీసులు 316 (3), 316 (5), 61 (2) రెడ్ విత్ 3 (5) బిఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బందరు తాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏసుబాబు దర్యాప్తు చేస్తున్నారు. వేబ్రిడ్జి సరిగా పనిచేయకపోవడం వల్ల బియ్యం నిల్వల్లో తరుగు కనిపిస్తోందని పౌరసరఫరాల సంస్థ అధికారులకు జయసుధ లేఖ రాసినట్లు తెలుస్తోంది. నాని మంత్రిగా ఉన్న సమయంలో ఈ గోదామును నిర్మించి, పౌరసరఫరాల సంస్థకు బఫర్ గోదాముగా లీజుకు ఇచ్చినట్లు సమాచారం.

పేలుడు పదార్థాల ఆర్మీ వాహనాన్ని ఢీకొన్న లారీ

- లారీ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-మేదరమెట్ల (బాపట్ల జిల్లా)

పేలుడు పదార్థాలతో ఉన్న ఆర్మీ వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామ సమీపంలోని నామ్ రహదారిపై బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి ఆర్మీకి సంబంధించిన పేలుడు పదార్థాల వస్తువులతో 18 కంటైనర్లు చెన్నైకి వెళ్తున్నాయి. బొడ్డువానిపాలెం సమీపంలోని పెట్రోల్ బంకులో ఆయిల్ నింపుకుంటున్న క్రమంలో వాహనాలు రోడ్డు పక్కన నిలిపారు.

ఈ క్రమంలో బల్లికురవ మండలం కొమ్మాలపాడు నుంచి బియ్యం లోడుతో చెన్నై వెళ్తున్న లారీ ఆగి ఉన్న ఆర్మీ కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. వెంటనే లారీకి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ బాలకృష్ణన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లారీ క్యాబిన్‌లో

కంటైనర్ను వెనక నుండి ఢీ కొట్టిన లారీ

ఇరుక్కున్న డ్రైవర్‌ను అతి కష్టం మీద బయటకు తీసి 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు ఆర్మీ అధికారులతో మాట్లాడారు. వాహనానికి 100 మీటర్ల దూరంలో ఎవరినీ ఉంచొద్దని ఆర్మీ అధికారులు సిఐకి తెలియజేశారు. ఈ ఘటనపై మేదరమెట్ల ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- ఎపి పిజిసెట్ ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

పిజిసెట్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

యూనివర్సిటీల్లో ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులు పరిపూర్ణమైన వ్యక్తులుగా ఎదగాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆకాంక్షించారు. ఎపి పిజి సెట్‌లో ర్యాంకులు సాధించిన వర్సిటీ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు 36 మందిని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యక్షుడు కె రూపస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో తాను కష్టపడి, ఇష్టపడి చదివానని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నానని, నేటి విద్యార్థులు కూడా అధ్యయనాన్ని విస్తృతం చేయాలని కోరారు. నేటి ప్రజా ప్రతినిధులు విద్యార్థి ఉద్యమం నుండి కాకుండా వ్యాపారాల నుండి వస్తూ వారి వ్యాపారాలను పెంచుకుంటున్నారని, వారిలో ప్రజాసేవ కనిపించడం లేదని తెలిపారు. విద్యార్థుల నుండి వచ్చిన నాయకత్వమే పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరముందని వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జి సింహాచలం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు చదువుకోవాలని.. ప్రపంచానికి తెలియని విషయాలన్నీ టెక్నాలజీ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ మాట్లాడుతూ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ప్రపంచ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా మన ఆలోచన విధానం మారాలన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి శివరామ ప్రసాద్, వర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కె నవిత, ఆర్ట్స్ కాలేజీ ప్రెసిడెంట్ ఉపేంద్ర, వర్సిటీ ఉపాధ్యక్షుడు అజయ్, వర్సిటీ నాయకులు ధనలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మూలధన వ్యయాల్లో పతనం..!

- కేంద్ర, రాష్ట్ర పిఎస్‌యుల పెట్టుబడుల తగ్గింపు
- మందగమనం ప్రభావం : నిపుణులు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మందగమనం పరిణామాలు ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయాలపైనా పడుతోందని స్పష్టమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ కంపెనీలు, సంస్థలు తమ మూలధన వ్యయాలను భారీగా తగ్గిస్తున్నాయని జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. జిడిపిలో పెట్టుబడుల వ్యయం ఐదేళ్ల గరిష్ట స్థాయి 5.87 శాతం నుంచి పడిపోయే అవకాశం ఉందని అంచనా. దీంతో వృద్ధి మందగింపు సంకేతాలు స్పష్టమవుతోన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024-25లో మొత్తం మూలధన వ్యయం లక్ష్యాన్ని చేరుకోవచ్చని లేదా దగ్గరగా చేరుతుందని అంచనా వేసినప్పటికీ.. వృద్ధి గత ఆర్థిక సంవత్సరం కంటే తక్కువగా ఉండవచ్చు" అని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వ్యక్తులు పేర్కొన్నట్లు మింట్ రిపోర్ట్ చేసింది.

2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయం రూ.17.35 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాది 2022-23లో ఇది రూ.13.57 లక్షల కోట్లుగా ఉంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ తాజా సమాచారం ప్రకారం.. 2024-25 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్ధంలో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం 15.4 శాతం పతనమై రూ.4.15 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ద్వితీయార్ధంలో మరిన్ని సవాళ్లు ఉండొచ్చని అంచనా. బడ్జెట్ లక్ష్యం రూ.11.11 లక్షల కోట్ల మూలధన వ్యయం చేరాలంటే ప్రస్తుత ద్వితీయార్ధంలో 52 శాతం వృద్ధిని సాధించాల్సి ఉంటుంది.

కఠిన పరిస్థితులను చక్కబెట్టుకోవడానికి వచ్చే జనవరి- మార్చి త్రైమాసికంలో పెట్టుబడులను వేగవంతం చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సంబంధిత శాఖలు, మంత్రిత్వ శాఖలను ఆదేశించింది. ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి రాబోయే బడ్జెట్‌లో కేంద్రం తన మూలధన వ్యయాన్ని కొనసాగించనుందని.. అదే విధంగా రాష్ట్రాలను ఆదేశించనుందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నట్లు మింట్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి ఉపయోగించేందుకు 'స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' స్కీమ్‌లో భాగంగా రాష్ట్రాలకు రూ.50,571.42 కోట్లను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. 2024-25కు గాను రాష్ట్రాలకు ప్రత్యేక పెట్టుబడుల పథకం కింద రూ.1.5 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు జులైలో జరిగిన మధ్యంతర బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న విషయం తెలిసిందే. పెట్టుబడులు మందగించడం ద్వారా ప్రధానంగా ఉపాధి కల్పన దెబ్బతిననుంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు మరింత పెరగనున్నాయి.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కోమటిలంక, శ్రీపర్రు వాసులు

లీజు డబ్బులు కాజేశారు!

- కలెక్టరేట్‌వద్ద కోమటిలంక, శ్రీపర్రు వాసుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రూ.ఆరు కోట్లు అక్రమంగా కాజేసిన ఏలూరు జిల్లా దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వెంటనే ఆ సొమ్మును జమ చేయాలని కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లేరు సంఘం నాయకులు, రైతు సత్యనారాయణ మాట్లాడుతూ.. గతంలో టిడిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తమ గ్రామంలో 230 ఎకరాల్లో చెరువులు తవ్వించారని, అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆ చెరువులను స్వాధీనం చేసుకుని ఎకరం రూ.50 వేలకు బయటివారికి లీజుకు ఇచ్చి గ్రామస్తులకు రూ.20 వేలు లీజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారన్నారు. గడిచిన ఐదేళ్లగా లీజు డబ్బులు చెల్లించలేదని, మొత్తం సుమారు రూ.ఆరు కోట్ల సొమ్ము అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి కొఠారు రామచంద్రరావు తీసుకున్నారని ఆరోపించారు. వెంటనే ఆ నగదును కోమటిలంక, శ్రీపర్రు గ్రామాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు అంబురి నాగరాజు, నేతల రవి, మోరు రామరాజు, ఘంటసాల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

జియో నుంచి న్యూఇయర్ ప్లాన్

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో వచ్చే నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకుని కొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. రిలయన్స్ జియో వెల్‌కమ్ ప్లాన్‌లో భాగంగా రూ.2025 రీచార్జ్‌పై దీర్ఘకాల గడువుతో పాటు రూ.2,150 విలువైన కూపన్ ప్రయోజనాలను అందిస్తోన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ ప్లాన్‌లో 200 రోజుల వాలిడిటీతో పాటు రోజుకు 2.5 జిబితో పాటు 5జి డేటాను అందిస్తున్నట్లు పేర్కొంది.

ప్రభుత్వ రంగం నిర్వీర్యంతో రిజర్వేషన్లకు విఘాతం

- స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యంతో రిజర్వేషన్లకు విఘాతం కలగనుందని స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1399వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఒబిసి అసోసియేషన్ కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను కాలరాయడమే లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి రిజర్వేషన్లను ఎత్తివేయాలని కుట్రలు పన్నుతోందని తెలిపారు. అదే జరిగితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళ, వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించే క్రమంలోనే అన్ని విభాగాలనూ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. సొంత గనులు, ఆర్థిక వనరులు కేటాయించి కర్మాగారాన్ని ఆదుకోవాలని, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌బిఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నూతన గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌బిఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ గవర్నర్‌గా సేవలందించిన శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ హోదాలో మల్హోత్రా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

బిగ్‌సి వార్షికోత్సవ వినూత్న ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి తన 22వ వార్షికోత్సవం సందర్భంగా వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్, సిఎండి ఎం బాలు చౌదరి తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని అనవాయితీగా ఆకర్షణీయ ఆఫర్లను ప్రకటిస్తున్నామన్నారు. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువగల స్మార్ట్‌వాచ్ లేదా రూ.1,799 విలువ గల ఇయర్‌బడ్స్‌ను కేవలం రూ.22కే అందిస్తున్నామన్నారు. అదే విధంగా 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాంక్, జీరో డౌన్‌పేమెంట్‌తో నో కాస్ట్ ఇఎంఐ ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు. సామ్‌సంగ్ మొబైల్స్ కొనుగోలుపై రూ.20వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్, ఐఫోన్‌పై రూ.7,000 వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చన్నారు. ఎటిఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టివి, ల్యాప్‌టాప్, ఎసిలు కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని కూడా అందిస్తున్నామన్నారు.

భారత వృద్ధి అంచనాలకు ఎడిబి కోత

న్యూఢిల్లీ : భారత జిడిపి అంచనాలకు ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) కోత పెట్టింది. దేశంలో బలహీన డిమాండ్, నివాసాలకు గిరాకీ తగ్గడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వృద్ధి 6.5 శాతానికే పరిమితం కావొచ్చని పేర్కొంది. ఇంతక్రితం ఈ అంచనా 7 శాతంగా ఉంది. అదే విధంగా వచ్చే 2025-26 వృద్ధి అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి కోత పెట్టింది. సెప్టెంబర్ త్రైమాసికంలో జిడిపి వృద్ధి తగ్గుదలను గుర్తు చేసింది. డిమాండ్ లేక తయారీ రంగం పేలవ ప్రదర్శన, ప్రభుత్వ వ్యయాలు తగ్గడాన్ని ఎత్తి చూపింది. 2024-25కు భారత జిడిపి అంచనాలను 7.2 శాతం నుంచి 6.6 శాతానికి కోత పెడుతూ ఇటీవల ఆర్‌బిఐ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.



వెలువడినది
నమో అదానీ కరెంటు కహాని
జగన్ మిలాఖత్ - బాబు ఖుషీమత్
ప్రజలకు తీవ్రనష్టం కలగజేసే ఈ అవినీతి ఒప్పందం లోతుపాతులను ఈ చిన్న పుస్తకం వెలుగులోకి తెస్తున్నది.
పేజీలు 32 +4 (టైటిల్) వెల : 10/-
ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
ఫోన్ : 9490099057
బ్రాంచీలు
విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు,

సంపాదకీయం

భూ పందేరం

అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు పెద్ద ఎత్తున భూ పందేరం చేయడానికి తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సిద్ధమౌతోంది. తాజాగా విడుదల చేసిన టూరిజం పాలసీ ఇందుకొక నిదర్శనం. పర్యాటక, ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి రాష్ట్ర వ్యాప్తంగా భారీ రాయితీలతో పాటు, భూములు కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని విధాన పత్రం పేర్కొంది. అంతేకాదు, ఎటువంటి వివాదాలు లేని (ఎన్‌కంబరెన్స్ ఫ్రీ) భూ బ్యాంకులను టూరిస్టు ప్రాజెక్టుల కోసం గుర్తించి, ప్రత్యేక కేటాయింపులు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. 200 నుండి 500 కోట్ల రూపాయలు, అంతకుపైన పెట్టుబడులతో వచ్చే మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు 'టైలర్ మేడ్'గా ఈ రాయితీలు అందించనుంది. ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే, వివిధ రకాల పారిశ్రామిక అవసరాల పేరిట ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమిని సేకరించి ఉన్నారు. సమైక్య రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏర్పడిన రెండు ప్రభుత్వాల్లోనూ ఈ సేకరణ ప్రక్రియ సాగింది. నయానో, భయానో ప్రజల నుంచి భూములను లాగేసుకుని పరిశ్రమల పేరుతో అస్మదీయ సంస్థలకు పందేరం చేశారు. ఇప్పటికీ ఆ భూముల్లో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలూ రాలేదు. ఆ భూముల్లో కొంత భాగం రియల్ ఎస్టేట్‌కు వాడుకున్నారు. ఇప్పుడు పర్యాటక రంగం కోసం కాబట్టి ఎంపిక చేసిన ప్రత్యేక ప్రదేశాల్లోనే భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను నామమాత్రంగా కూడా ప్రకటించక పోవడం గమనార్హం.

విభజన తరువాత రాష్ట్రంలో మొట్టమొదట ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి పేరుతో 2015 అక్టోబర్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 7.82 లక్షల ఎకరాలను సేకరించింది. వీటిలో అప్పటికప్పుడు కేటాయించేందుకు వీలుగా 2.73 లక్షల ఎకరాలు ఉన్నాయని కూడా తెలిపింది. ఇలా తక్షణ కేటాయింపు కోసం కొన్ని చట్టాల్లో సవరణలు కూడా తీసుకొచ్చింది. ఇవిగాక, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ) పార్కుల పేరిట ప్రతి నియోజకవర్గానికి కనీసం 7,500 ఎకరాలు సేకరించడాన్ని అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిని చాలా వరకు పూర్తి చేశారు కూడా! రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాగిన ఈ భూ లావాదేవీలు, కేటాయింపుల వ్యవహారంలో భారీ కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. 2019 ఎన్నికల్లో గెలిచిన తరువాత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి వివరాలను ఇవ్వాలని ఆదేశించిన జగన్మోహన్‌రెడ్డి ఆ తరువాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మరోవైపు వైసిపి ప్రభుత్వ హయాంలోనూ భూ దందా యథేచ్ఛగా కొనసాగింది. తాజా ఎన్నికల్లో గెలుపొందిన తరువాత ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు గనులు, అటవీశాఖపై విడుదల చేసిన శ్వేతపత్రంలో వైసిపి ప్రభుత్వంలో లక్షల ఎకరాల్లో భూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఆ భూములను వెనక్కి తీసుకుని పేదలకు పంచాలని, మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలన్న డిమాండ్‌ను మాత్రం ఆయన ఇప్పటివరకు పట్టించుకోలేదు.

రెండు ప్రభుత్వాలు రకరకాల పేర్లతో లక్షల ఎకరాల భూములను రైతుల నుండి లాక్కొని కార్పొరేట్లకు, ఆశ్రిత పెట్టుబడిదారులకు పందేరం చేస్తున్నాయి. అయితే ఎక్కడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించడం, రైతుల ఆమోదం తీసుకోవడం, న్యాయమైన పరిహారం ఇవ్వడం వంటివి జరిగిన దాఖలాలు లేవు. తాతలు, తండ్రుల కాలం నుండి సాగు చేస్తున్న ప్రభుత్వ, ఫారెస్టు, బంజరు భూములకు హక్కు పత్రాలు లేవనే సాకుతో పరిహారం నిరాకరిస్తున్నారు. పట్టా భూములకు నామమాత్రపు పరిహారం చెల్లించి చేతులు దులిపేసుకుంటున్నారు. గిరిజనుల భూములు సేకరిస్తే భూమికి భూమి ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని చట్టం ఉన్నా దానిని బేఖాతరు చేస్తున్నారు. అదే సమయంలో నివాస స్థలాల కోసం నిరుపేదలు ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా జానెడు స్థలం కూడా ఇవ్వడం లేదు. సామాన్యులను విస్మరించి, కార్పొరేట్ ప్రయోజనాలకే పట్టం కట్టే ఈ తరహా విధానాలను ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

మంచిమాట

సామాజిక దృష్టి,
శాస్త్రీయ దృక్పథం పెరిగితే...
ప్రజలందరికీ ఆరోగ్యం అనే నినాదంతో
ముందుకు సాగితే...
మానవ కల్యాణం సులభ సాధ్యం
అవుతుంది.

- ఎడ్వర్డ్ జెన్నర్,
ఆంగ్ల శాస్త్రవేత్త,
రోగ నిరోధక శాస్త్ర పితామహుడు.

ఎందరు పిల్లలను కనాలో కూడా వారే నిర్ణయిస్తారా!

విశ్లేషణ

ఎం. కోటేశ్వరరావు

జనాభా తగ్గకుండా ఉండాలంటే ప్రతి మహిళ కనీసం ముగ్గురు పిల్లలను కనాలని ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ నాగపూర్‌లో జరిగిన ఒక సభలో చేసిన వ్యాఖ్య పెద్ద దుమారమే రేపింది. అదానీ లంచాలపై మోడీ నోరు విప్పాలంటూ పార్లమెంటును స్థంభింప చేయటం, ధరల పెరుగుదల, రూపాయి విలువ పతనం, దిగజారిన జిడిపి వంటి అనేక సమస్యలు చుట్టుముడుతుండగా వాటి మీద నోరెత్తకుండా ఒక సమావేశంలో ఎక్కువ మంది పిల్లల్ని కనాలన్న పిలుపు ఇవ్వటం ఏమిటన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కాళిదాసు కవిత్వానికి తమ పైత్యం జోడించినట్లు జనాభా తగ్గుదల, వృద్ధుల పెరుగుదల గురించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రులు చేసిన వ్యాఖ్యల పూర్వ రంగంలోనే ఇలా మాట్లాడినట్లు ఒక వర్గపు మీడియా భాష్యం చెప్పింది. అసలు విషయం ఏమంటే ఇద్దరు సిఎంలు చెప్పింది మొత్తంగా వృద్ధులు పెరుగుతున్నారని, దాన్ని అవకాశంగా తీసుకొని మోహన్ భగవత్ హిందువులు తగ్గిపోతున్నారని, పెంచాలనే నేపథ్యంలో మాట్లాడారు. జనాభా శాస్త్రం ప్రకారం సంతానోత్పత్తి రేటు 2.1 కంటే తగ్గితే ఎవరూ నాశనం చేయకుండానే సమాజం అంతరించి పోతుందని భగవత్ చెప్పారు. 0.1 సంతానం ఉండదు గనుక ముగ్గురు ఉండాలన్నారు. సంతానోత్పత్తి రేటు అంటే ఒక మహిళ జీవిత కాలంలో ఎంత మంది పిల్లలకు జన్మనిచ్చిందో తెలిపే సగటు. ఇది దేశాలను బట్టి, దేశంలోనే ప్రాంతాలు, విశ్వాసాలు, ఇతర అనేక అంశాలను బట్టి మారుతూ ఉంటుంది. అన్నింటినీ కలిపితే ప్రపంచ సగటు వస్తుంది. జనాభా పెరుగుదల లేదా తగ్గుదల గురించి ఎవరైనా తమ వైఖరిని చెప్పవచ్చు. కానీ దానికి మతాన్ని ముడిపెట్టటమే అసలు సమస్య. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి 2022 అక్టోబరులో జనాభా అదుపునకు సమగ్ర విధానం ఉండాలని, మత ప్రాతిపదికన అసమతూకం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

హిందూ మతం బతికి బట్టకట్టాలంటే హిందువులు పది మంది పిల్లలను కనాలని ఆర్‌ఎస్‌ఎస్ గుంపుకు చెందిన విశ్వహిందూ పరిషత్ నేతలు పిలుపు ఇచ్చారు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2015 జనవరి 19 లక్నో). ఆ సంస్థ ఏర్పాటు చేసిన ఒక సభలో దాని అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా మాట్లాడుతూ హిందూ మతం పెరగాలంటే ఎనిమిది నుంచి పది మంది పిల్లలను కనాలని చెప్పారు. బిజెపి ఎంపీ సాక్షి మహరాజ్ నలుగురిని కనాలన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా 2006 ఏప్రిల్ 20వ తేదీన "కాషాయ జనాభా శాస్త్రం" పేరుతో ప్రచురించిన విశ్లేషణ వివరాల ప్రకారం అదే సంస్థ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ 2004లో మాట్లాడుతూ హిందువులు ఎక్కువ మంది పిల్లల్ని కనకపోవటం ఆత్మహత్యా సదృశ్యమన్నారు. కుటుంబ నియంత్రణ పాటించ కూడదన్నారు. కుటుంబ నియంత్రణ అన్నది హిందువులకు ఇంకేమాత్రం వ్యక్తిగత సమస్య కాదని, ఒక బిడ్డ చాలని వారు అనుకుంటే ముస్లింలు దేశాన్ని స్వాధీనం చేసుకుంటారని విశ్వహిందూ పరిషత్ నేత చంపత్ రాయ్ 2015లో ఒక పత్రికా గోష్టిలో చెప్పారు. చిత్రం ఏమిటంటే ఇదే విహెచ్‌పి కొత్త పల్లవి అందుకుంది. ఇప్పటి వరకు ఏకరూప పౌరస్మృతిని అమలు జరపాలన్న వారు జనాభా నియంత్రణ అందరికీ ఒకే విధంగా ఉండాలని, ఇద్దరు పిల్లలకు మించి ఏ మతం వారూ కనకూడదని చెబుతోంది. "ఆర్గనైజర్‌లో రాసిన తరువాత ఉమ్మడి జనాభా విధానం, ఏకరూప పౌరస్మృతి ప్రకారం అందరికీ ఇద్దరు పిల్లల నియమం ఉండాలని కోరుతున్న విహెచ్‌పి" అనే శీర్షికతో 2024 జులై 11న "ది ప్రింట్" ఆన్‌లైన్ పత్రిక ఒక వార్తను ప్రచురించింది. జనాభా అసమ తూకాన్ని నిరోధించాలని, ముస్లిం జనాభా పెరుగుదల గణనీయంగా ఉండటమే దీనికి కారణమని ఆర్గనైజర్ (ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక) సంపాదకీయం లంకె పెట్టిందని దానిలో వ్యాఖ్యానించారు. విహెచ్‌పి సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ ఆ పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ ఏకరూప పౌరస్మృతిలో ఇద్దరు పిల్లల నిబంధన కూడా చేర్చాలన్నారు.



జనాభా నియంత్రణ విధానంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఇతర పద్ధతులను మన ప్రభుత్వాలు ప్రోత్సహించాయి తప్ప ఒక్క హిందువులు మాత్రమే పాటించాలని, ముస్లింలు, ఇతర మతాలవారికి మినహాయింపులు ఇచ్చినట్లు చెప్పలేదు. అది కూడా స్వచ్ఛందం తప్ప ఎలాంటి నిర్బంధం చేయలేదు. మరి కాషాయ దళాలు దాన్ని ఎందుకు వక్రీకరిస్తున్నట్లు? అన్ని మతాల వారికి ఇద్దరిని మించి కనగూడదని నిబంధనలు పెట్టాలని ఎందుకు కోరుతున్నట్లు? జనాభా సమ తూకం అంటే వీరి దృష్టిలో ఏమిటి? ఏ మతం వారు ఎందరుంటే సమ తూకం ఉంటుంది? అంటే వీరు చెప్పినట్లే జనం మతాన్ని పాటించాలి, ఎందరు పిల్లల్ని కనమంటే ఆ సంఖ్యలోనే కనాలి. ఇలాంటి వారిని సహిస్తే రానున్న రోజుల్లో ఏ కులం వారు ఎంత మంది ఉండాలో కూడా వీరే నిర్దేశిస్తారన్నమాట!

హిందూ జాతి అంతరిస్తున్నదని, మతానికి ముప్పు వచ్చిందని, త్వరలో ముస్లిం జనాభా మెజారిటీగా మారుతుందని హిందూ మహాసభ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులంతా పదే పదే చేస్తున్న గోబెల్స్ ప్రచారం తెలిసిందే. అయితే మోహన్ భగవత్ కనీసం ముగ్గుర్ని కనాలంటూ సంఖ్యను తగ్గించారు. గతంలో మాదిరి డజన్ల కొద్దీ సంతానాన్ని కని హిందూ మతాన్ని పెంచాలంటే మొదటికే మోసం వస్తుందని, ఉన్న ఆదరణ కోల్పోతామన్న భయంతోనే ఇలా మాట్లాడుతున్నారన్నది స్పష్టం. జనాభా నియంత్రణ విధానంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఇతర పద్ధతులను మన ప్రభుత్వాలు ప్రోత్సహించాయి తప్ప ఒక్క హిందువులు మాత్రమే పాటించాలని, ముస్లింలు, ఇతర మతాలవారికి మినహాయింపులు ఇచ్చినట్లు చెప్పలేదు. అది కూడా స్వచ్ఛందం తప్ప ఎలాంటి నిర్బంధం చేయలేదు. మరి కాషాయ దళాలు దాన్ని ఎందుకు వక్రీకరిస్తున్నట్లు? అన్ని మతాల వారికి ఇద్దరిని మించి కనగూడదని నిబంధనలు పెట్టాలని ఎందుకు కోరుతున్నట్లు? జనాభా సమ తూకం అంటే వీరి దృష్టిలో ఏమిటి? ఏ మతం వారు ఎందరుంటే సమ తూకం ఉంటుంది? అంటే వీరు చెప్పినట్లే జనం మతాన్ని పాటించాలి, ఎందరు పిల్లల్ని కనమంటే ఆ సంఖ్యలోనే కనాలి. ఇలాంటి వారిని సహిస్తే రానున్న రోజుల్లో ఏ కులం వారు ఎంత మంది ఉండాలో కూడా వీరే నిర్దేశిస్తారన్నమాట!

ఇంతకీ ముగ్గురు పిల్లలను కనాలని కేవలం హిందువులకే చెబుతున్నారా లేక జనాభా మొత్తానికా అన్నది మోహన్ భగవత్ చెప్పలేదు. ముస్లింలు, నాలుగు వివాహాలు చేసుకొని ఎక్కువ మందిని కని హిందూ జనాభాను మించిపోవాలని చూస్తున్నారన్న ప్రచారం వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాలలో చేస్తున్నది హిందూత్వ శక్తులే అని వేరే చెప్పనవసరం లేదు. ఇది నిజమా ? ఈ గుంపు మాటలు వాస్తవమైతే భారత్ ఎప్పుడో ముస్లిం మతస్తులతో నిండిపోయి ఉండాల్సింది. భారత ఉపఖండంలోకి ముస్లింలు, ఇస్లాం మత రాక క్రీస్తుశకం 7వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. పన్నెండు వందల నుంచి 1,700 శతాబ్దం వరకు ఐదు వందల సంవత్సరాల పాటు ముస్లిం రాజుల పాలన సాగింది. తరువాత రెండు వందల సంవత్సరాలు క్రైస్తవులైన ఆంగ్లేయుల పాలన ఉంది. అయినప్పటికీ భారత్‌లో ఇప్పటికీ 80 శాతం మంది హిందువులే ఉన్నారు. బలవంతపు మత మార్పిడులు చేశారని, ఎక్కువ మంది పిల్లలను కన్నారని చెప్పిన తరువాత పరిస్థితి ఇది. ఆ ప్రచారం ఇప్పటికీ కొనసాగుతున్నందున హిందూ మతాన్ని నిలబెట్టేందుకే ముగ్గురు పిల్లలను కనాలన్నది మోహన్ భగవత్ మాటలకు అర్థం. ఎందుకంటే ఇదే భగవత్ 2022 అక్టోబరులో అందరికీ వర్తించే సమగ్ర జనాభా విధానం కావాలంటూనే మత ప్రాతిపదికన అసమతూకం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో జనాభా పెరుగుదలను మత కోణంలో చూడటం అవాంఛనీయ వైఖరి.

ఇదే గనుక వాస్తవమైతే ముస్లిం ఛాందసులు అధికారంలో ఉన్న ఇరాన్‌లో సంతానోత్పత్తి రేటు ఏడాదికేడాది ఎందుకు తగ్గుతున్నదో ఎవరైనా చెప్పగలరా? విద్య, పట్టణీకరణ, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, శిశుమరణాలు తదితర పరిస్థితులను బట్టి తప్ప ప్రపంచంలో ఎక్కడా మత ప్రాతిపదికన పిల్లలను కనటం లేదు. తమ ఉన్మాద చర్యలకు ఉపయోగించుకోవటం తప్ప ఏ మతమూ పిల్లల బాగోగులకు బాధ్యత తీసుకోవటం లేదు. 2023లో దక్షిణ కొరియాలో సంతానోత్పత్తి 0.7 ఉండగా ఆఫ్రికాలోని నైగర్‌లో 6.1 ఉంది. ఆర్థికాభివృద్ధి, విద్య, పట్టణీకరణ తదితర అనేక అంశాలు దీన్ని ప్రభావితం చేస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన 1,800 సంవత్సర ప్రారంభంలో ప్రపంచంలో 4.5 నుంచి 7.5 వరకు ఉంది, 1960 దశకంలో ఐదు ఉండగా 2023 నాటికి 2.3కు తగ్గింది. 2,100 నాటికి 1.8కి తగ్గుతుందని అంచనా. ఇతర అన్ని దేశాలలో మాదిరే మనదేశంలో కూడా అన్ని చోట్లా ఒకే విధంగా లేదు. కొన్ని వివరాలు చూద్దాం. 2019-21లో జరిగిన ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం జాతీయ స్థాయిలో సంతానోత్పత్తి రేటు 2.1 ఉంటే దక్షిణాది రాష్ట్రాలలో 1.64, ఉత్తరాదిన 2.0, పశ్చిమాన 1.81, తూర్పున 2.0, మధ్య ప్రాంతంలో 2.1 ఈశాన్య ప్రాంతంలో 2.15 ఉంది. రాష్ట్రాలన్నింటా ఒకే విధంగా లేదు. బీహార్‌లో 3.02 పక్కనే ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో 2.38, దాన్నుంచి ఏర్పాటు చేసిన ఉత్తరాఖండ్‌లో 1.87, పశ్చిమ బెంగాల్‌లో 1.56 పక్కనే ఉన్న ఒడిషాలో 2.14 చొప్పున ఉంది. ఒకే రాష్ట్రంలో చూస్తే గుజరాత్ గ్రామీణంలో 2.15, పట్టణాల్లో 1.63, మధ్యప్రదేశ్‌లో 2.23-1.62, తెలంగాణలో 1.95-1.63, ఆంధ్రప్రదేశ్‌లో 1.74-1.62 ఉంది.

ఎందరు పిల్లల్ని కనాలనే అంశంలో కాషాయ దళాలు మాట ఎందుకు మారుస్తున్నట్లు? సమగ్ర జనాభా విధానం ఉండాలని చెబుతున్నవారు జనాభా గురించి ఒక సమగ్ర దృష్టితో కాకుండా విద్వేష, పాక్షిక దృష్టితో ఎందుకు చూస్తున్నట్లు ? ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే అదే నిజం అవుతుందన్న గోబెల్స్ సిద్ధాంతం కొంతకాలం నడిచింది. ఇప్పుడు అదే అబద్ధాలు చెబితే కుదరదు. దేశంలో వారు ప్రచారం చేసినట్లుగా ముస్లింల జనాభా పెరగలేదు, హిందువులు అంతరించలేదు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రవేశ పెట్టిన వెంటనే దేశంలోని అన్ని సామాజిక తరగతులు ఒకే విధంగా స్పందించలేదు. 2015-16 జాతీయ కుటుంబ సర్వే వివరాల ప్రకారం ఎక్కువ విద్యావంతులున్న జైన్ సామాజిక తరగతిలో సంతానోత్పత్తి రేటు 1.2 శాతమే. మొత్తంగా చూసినపుడు అత్యంత పేదల్లో 3.2 ఉండగా ధనికుల్లో 1.5 మాత్రమే ఉంది. ముస్లిం సామాజిక తరగతిలో సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉండటానికి వారు ఆలశ్యంగా మేలుకోవటమే. దానికి కుట్ర సిద్ధాంతాలతో విద్వేష ప్రచారం చేయటం తగని పని. తాజా సమాచారాన్ని చూసినపుడు సంతానోత్పత్తి రేటు తగ్గుదల హిందువులతో పోల్చితే ముస్లింలలో వేగంగా ఉంది. 1992 నుంచి 2021 మధ్య కాలంలో ముస్లింలలో 4.41 నుంచి 2.36కు (2.05 మంది) తగ్గగా హిందువుల్లో 3.3 నుంచి 1.94కు (1.36 మంది) పడిపోయింది. హిందువుల్లోని దళితుల్లో 2.08, గిరిజనుల్లో 2.09, ఓబిసిల్లో 2.02 ఉంది. ఈ మూడు కాని తరగతుల్లో 1.78 ఉంది. సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉన్న వారిలో విద్య, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే కొద్దీ సంతానోత్పత్తి రేటు తగ్గుతున్నట్లు ప్రతి సర్వే వెల్లడిస్తున్నది. అందువలన ముస్లింలను బూచిగా చూపటం మెజారిటీ ఓట్ల రాజకీయం తప్ప మరొకటి కాదు. కొస మెరుపు ఏమిటంటే ముస్లింల కంటే ఎక్కువగా రాష్ట్ర సగటు సంతానోత్పత్తి రేటు ఉత్తర ప్రదేశ్‌లో 2.47, బీహార్‌లో 3.19 ఉంది. దీని వెనుక ఏదైనా కుట్ర ఉందని ఎవరైనా చెప్పగలరా? ఆ రాష్ట్రాలు దుర్భర దారిద్ర్యంలో ఉండటమే కారణం. మైనారిటీలూ అంతే.

సహకార రంగంలో పాడి పరిశ్రమను కాపాడుకుందాం

సమస్య

మర్రాపు సూర్యనారాయణ

విశాఖ డెయిరీ (శ్రీ విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్) పరిధిలో రైతుల నుంచి పాల సేకరణ ధర లీటరుకు రూ.3 తగ్గించారు. నవంబరు నెల మొదటి పేమెంటు నుండి ధర తగ్గింపు అమల్లోకి వచ్చింది. తగ్గిన ధరలతో వచ్చిన బిల్లు చూసి రైతులు ఆందోళన చెందారు. ఇప్పటికే పాల ధర గిట్టుబాటు కావడం లేదు. గ్రామాల్లో గతంలో మాదిరిగా పచ్చిక బయళ్లు లేవు. గడ్డి, దాణా, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ...అన్నింటికీ ధరలు పెరిగాయి. ఖర్చుల పెరుగుదల నిష్పత్తిలో పాల సేకరణ ధర పెంచాలని పాల రైతులు అడుగుతున్నా విశాఖ డెయిరీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకూ ఇస్తున్న ధరనూ తగ్గించడంతో పాల రైతాంగం భగ్గుమన్నది. నిరసనలతో వివిధ ప్రాంతాల్లో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నది.

విశాఖ డెయిరీకి ఏడు జిల్లాల నుంచి సుమారు 3.85 లక్షల మంది రైతులు రోజూ 9 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. తగ్గించిన ధర వల్ల రైతులు రోజుకు సుమారు రూ.20 లక్షలు నష్టపోతున్నారు. ఇంతగా ధర కోసిన సందర్భం ఇంతకు ముందు ఎప్పుడూ లేదు. 1973లో కార్పొరేషన్‌గా ఏర్పడి, 1981లో మూడంచెల సహకార వ్యవస్థలోకి వచ్చింది. 1983లో జిల్లా సహకార సంఘంగా ఏర్పడి అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. ఏడు జిల్లాలకు విస్తరించింది. పాల రైతుల స్వేదం, కష్టంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీకి వేల కోట్ల ఆస్తులు సమకూరాయి. మార్కెట్లో మంచి బ్రాండ్ ఇమేజ్ వచ్చింది. అయినప్పటికీ ఈ అభివృద్ధిలో వచ్చిన ఫలాలేవీ రైతుకు దక్కకుండా దారి మళ్లుతుండటం పెద్ద విషాదం.

రైతుకిచ్చేది రూ.34, మార్కెట్లో అమ్ముకునేది రూ.54

3.5 వెన్న శాతం ఉన్న లీటరు ఆవు పాలకు రైతుకు రూ.34 చెల్లిస్తున్నారు. అవే పాలు మార్కెట్‌లో వినియోగదారులకు వెన్న శాతం తగ్గించి రూ.54కు అమ్ముతున్నారు. 5.5 వెన్న శాతం ఉన్న లీటరు గేదె పాలకు రూ.38 చెల్లిస్తూ అవే పాలను మార్కెట్లో రూ.64కి విక్రయిస్తున్నారు. అంటే రైతుకు చెల్లిస్తున్న సేకరణ ధరకూ వినియోగదారుడికి అమ్ముతున్న ధరకూ వ్యత్యాసం లీటరుకు రూ.20 నుంచి రూ.24 వరకూ ఉంది. నిర్వహణ ఖర్చులు లీటరుకు రూ.8 నుంచి రూ.10 తీసివేసినా ఇంకా లీటరుకు రూ.12 నుంచి రూ.14 మిగులు ఉంటుంది. మిగులు ఉన్న దానిలో రూ.10 రైతుకు ఇవ్వాలని పాల రైతులు, రైతు సంఘాలు చేస్తున్న డిమాండ్‌లో న్యాయం ఉంది. పైగా డెయిరీకి ఉప ఉత్పత్తుల అమ్మకాల వల్ల అదనపు ఆదాయం లభిస్తున్నది. అయినప్పటికీ రైతులకిస్తున్న పాల సేకరణ ధరలు తగ్గించడంలో ఏమాత్రం ఔచిత్యం లేదు.

విశాఖ డెయిరీ కంపెనీ చట్టంలోకి మారినప్పటి నుండి ఛైర్మన్ కుటుంబ పెత్తనం పెరిగింది. డెయిరీ ఆస్తులను, వనరులను పక్కదారి పట్టించడంతో వచ్చిన నష్టాలు రైతులు, కార్మికులపైకి నెడుతున్నారు. ఈ కాలంలో జరిగిన పరిణామాలను గమనిస్తే రైతాంగానికి వచ్చిన ప్రయోజనాలు శూన్యం. అంతవరకూ పొందిన కొన్ని రాయితీలు, సౌకర్యాలు తగ్గిపోయాయి. ఎప్పుడూ లేని విధంగా పాల సేకరణ ధరలూ తగ్గించారు. అలా అని వినియోగదారులకు ధరలు తగ్గించారా అంటే అదీ లేదు. ఏటా పాలు, నెయ్యి, ఉప ఉత్పత్తుల ధరలు పెంచుతున్నారు. పాలకవర్గం, వారి అనుయాయులు చెప్పిన కో ఆపరేటివ్ చట్టం నుంచి కంపెనీ చట్టంలోకి మార్చడం రైతుల, వినియోగదారుల ప్రయోజనం కోసం కాదని తేలిపోయింది.

కుటుంబ పెత్తనం

కో ఆపరేటివ్ చట్టం 1964 ద్వారా విశాఖ డెయిరీ ఏర్పడి క్రమంగా అభివృద్ధి చెందింది. గ్రామ గ్రామాన స్థానిక సంఘాలు ఏర్పడి, సహకార స్ఫూర్తితో రైతుల సమిష్టి భాగస్వామ్యంతో 6,720 గ్రామాలకు విస్తరించింది. లాభాలతో నడుస్తున్న ఈ డెయిరీపై 1990 తరువాత దేశంలో అమల్లోకి వచ్చిన నూతన ఆర్థిక విధానాల ప్రభావం పడింది. నూతన ఆర్థిక విధానాలను బలపరిచే లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ వంటి కార్పొరేట్ అనుకూల మేధావుల వాదనలు తోడైనాయి. 1964 కో ఆపరేటివ్ యాక్టు ప్రకారం డెయిరీల స్వేచ్ఛా వ్యాపారం ముందుకు సాగలేదనే వాదనలు అంది పుచ్చుకొని, నాటి ప్రభుత్వం కల్పించిన అవకాశాలతో 1995 మాక్స్ చట్టంలోకి మారిపోయారు. ప్రభుత్వ పర్యవేక్షణ నుంచి లభించిన స్వేచ్ఛను ఉపయోగించుకున్న డెయిరీ పాలకవర్గం వ్యాపారంతో లాభాలు పెంచడం, రైతులకు అదనపు ప్రయోజనాలు సమకూర్చడం వంటి పనులు ముందు చెప్పినట్లుగా చేయలేదు. మ్యాక్స్ చట్టంలోకి మారడం రైతుల ప్రయోజనాల కోసమే అన్నది నిజం కాదని తేలింది. చట్టం ద్వారా లభించిన స్వేచ్ఛను ఉపయోగించుకొని డెయిరీపై ఛైర్మన్ కుటుంబ పెత్తనం, అజమాయిషీ పెరిగింది. అక్కడితో ఆగకుండా డెయిరీ ఆస్తులు, వనరులపై పట్టు సాధించడం కోసం మ్యాక్స్ చట్టం నుండి కంపెనీ చట్టం 1956 లోకి విశాఖ డెయిరీని మార్పు చేశారు. దీనివల్ల డెయిరీలో సహకార స్ఫూర్తి లేకుండా పోయింది. సొసైటీలకు ఎన్నికలు ఉండవు. కంపెనీ యాక్టు ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయి. మూడో వంతు సభ్యులకు వంతుల వారీగా జరిగే ఎన్నికల్లో ఛైర్మన్ హవా కొనసాగుతుంది. సాధారణ రైతులు ఎన్నికలను ప్రభావితం చేయలేని పరిస్థితి ఉంటుంది. విశాఖ డెయిరీ కంపెనీ చట్టంలోకి మారినప్పటి నుండి ఛైర్మన్ కుటుంబం పెత్తనం పెరిగింది. డెయిరీ ఆస్తులను, వనరులను పక్కదారి పట్టించడంతో వచ్చిన నష్టాలు రైతులు, కార్మికులపైకి నెడుతున్నారు. ఈ కాలంలో జరిగిన పరిణామాలను గమనిస్తే రైతాంగానికి వచ్చిన ప్రయోజనాలు శూన్యం. అంతవరకూ పొందిన కొన్ని రాయితీలు, సౌకర్యాలు తగ్గిపోయాయి. ఎప్పుడూ లేని విధంగా పాల సేకరణ ధరలూ తగ్గించారు. అలా అని వినియోగదారులకు ధరలు తగ్గించారా అంటే అదీ లేదు. ఏటా పాలు, నెయ్యి, ఉప ఉత్పత్తుల ధరలు పెంచుతున్నారు. పాలకవర్గం, వారి అనుయాయులు చెప్పిన కో ఆపరేటివ్ చట్టం నుంచి కంపెనీ చట్టంలోకి మార్చడం రైతుల, వినియోగదారుల ప్రయోజనం కోసం కాదని తేలిపోయింది. ఈ మార్పు వల్ల ఛైర్మన్, తన కుటుంబం, వారి అనుయాయులకు డెయిరీ ఆస్తులు, వనరులు కబ్జా చేయడానికి వెసులుబాటు వచ్చింది. ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం వల్ల వచ్చిన స్వేచ్ఛతో అవినీతి, అక్రమాలను విచ్చలవిడిగా చేశారు. సంవత్సరాల తరబడి ఆడిట్ లేకుండా, రైతులకు, ప్రభుత్వానికి జవాబుదారీ లేకుండా డెయిరీని సొంత కుటుంబ ఆస్తిలా నడుపుతున్నారు.

పాల ధర పునరుద్ధరణకై ఉద్యమాలు

ఈ పరిణామాలు రైతుల్లో ఆగ్రహావేశాలు కల్పించాయి. అక్టోబరు 29న వందలాది మంది రైతులు ఐదు జిల్లాల నుంచి విశాఖ డెయిరీ కేంద్ర కార్యాలయానికి వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. తగ్గించిన పాల ధర పునరుద్ధరించాలని, సేకరణ ధరకు, అమ్మకం ధరకు ఉన్న వ్యత్యాసంలో రూ.10 రైతుకు కలపాలని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని, డెయిరీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి, దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, విశాఖ డెయిరీని తిరిగి 1964 సహకార చట్టం పరిధిలోకి తేవాలని, పాల రైతులకు పక్క రాష్ట్రాలు ఇస్తున్నట్లుగా లీటరు పాలకు రూ.5 ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఇవ్వాలని ఆందోళన చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని రైతాంగం కోరుకుంటోంది.

చిన్న, పేద రైతుల ఆదాయానికి ప్రధాన వనరుగా ఉన్న పాడి పరిశ్రమను కో ఆపరేటివ్ రంగంలో అభివృద్ధి పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం చూపిస్తోంది. రాష్ట్రంలో పలు కో ఆపరేటివ్ డెయిరీలు మాక్స్, కంపెనీ చట్టాలకు మారిపోయినా రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. చివరికి కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా సహకార సంఘాలను తన ఆధిపత్యంలోకి తెచ్చుకునేందుకు బహుళ రాష్ట్ర సహకార సంఘం చట్టం చేసి ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినా స్పందించలేదు. గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం విదేశీ పాల ఉత్పత్తులకు అనుమతి ఇచ్చి, దేశీయ పాల పరిశ్రమకు నష్టం చేకూర్చింది. దేశీయ పాల ఉత్పత్తులపైన 5 శాతం, పాల సేకరణ, శీతలీకరణ, పాల ఉత్పత్తులను తయారు చేసే పరికరాలపైన 18 శాతం జిఎస్‌టి పెంచి, దేశీయ పాల పరిశ్రమపై మోడీ ప్రభుత్వం భారాలు మోపినా రాష్ట్ర ప్రభుత్వాలు కిమ్మనలేదు. కనుక రైతాంగం సహకార రంగంలో పాడి పరిశ్రమను కాపాడుకోవాలి. కార్పొరేట్, కమ్యూనల్ విధానాలను ప్రతిఘటించే పోరాటాలను బలపరుచుకోవాలి.

/ వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం ఉపాధ్యక్షులు /

కవిత్వం

ధర్మాగ్రహమదిగో...

ఎండకు ఎండి వానకు తడిసి
బిడ్డ పంటను ఉగ్గుపాలతో పెంచినోళ్ళు
కొత్త చట్టాల అమలు పట్టుపట్టి
ఛలో ఢిల్లీ అంటూ చలిలో
పాలకులకు చెమటలు పట్టేలా
కవాతు చేస్తూ వస్తున్నారదిగో..
దేశానికి జవజీవాలు అందించే ధన్వంతరులు
జాతి కోసం జాగృతి కోసం
పరిహారం, ప్రయోజనాలు కోరుతూ
జనగీతి పాడుతున్నారదిగో...
మట్టినేలను బంగారుకంచం చేసి
అమృతం పండించిన భగీరథులు
కొత్త చట్టాల చలనానికి కదిలొస్తున్నారదిగో...
పంటకు ఆయుష్షు పోసిన అన్నదాతలు
ఆయువు పట్టంటి వ్యవసాయం ఆయువు
తీయొద్దంటూ ఆక్రోశిస్తున్నారదిగో..
ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకున్న గుండె
పాలకుల విపరీత ధోరణుల్ని
భరించలేకపోతోందదిగో...
నేలను దున్ని గోధుమలు పండించి
కాయదేరిన కాయాలు
ధర్మ పోరాటానికి కాలు దువ్వి
ఛలో ఢిల్లీ అంటూ కదిలొస్తున్నాయదిగో!

- భీమవరపు పురుషోత్తమ్,
రాజమండ్రి, సెల్ : 9949800253

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

అన్ని ప్రశ్నాపత్రాలు ఒకేరోజు పంపాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమ్మెటివ్ పరీక్షల ప్రశ్నాపత్రాలను ఒకేరోజు పాఠశాలలకు పంపించే చేయాలని ఎపిటిఎఫ్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం జరిగే ప్రశ్నాపత్రాలు ఉదయం పూట, మధ్యాహ్నం జరిగే పరీక్షల మధ్యాహ్నం పూట గంట ముందు వచ్చి తీసుకెళ్లాలని అధికారులు ఆదేశించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. మండల కేంద్రానికి రెండుపూటలా వచ్చి పేపర్లు తీసుకెళ్లడం సాధ్యం కాని పని అని తెలిపారు. పరీక్షల ముందురోజు గానీ, స్కూల్ కాంప్లెక్స్ నుంచి రెండు రోజులకోసారి పంపిణీ చేసే విధంగా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు.

భూముల మార్కెట్ విలువ పెంపు

- 2025 మార్చికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం లక్ష్యం రూ.4,792కోట్లు
- నేడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మార్గనిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు ఆదాయాన్ని పెంచుకునేందుకు మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువను మరోసారి పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. సచివాలయంలో సిఎం అధ్యక్షతన గురువారం జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఈ విషయంపై జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గనిర్దేశం చేయనుంది. ప్రభుత్వ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు మున్సిపల్ కార్పొరేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల మార్కెట్ విలువను తొలుత లెక్కిస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలు, రిజిస్ట్రేషన్లు అత్యధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో మార్కెట్ విలువను ఎంతమేర పెంచవచ్చో అధికారులు లెక్కలు వేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం టైమ్‌లైన్ ప్రోగ్రామ్‌ను ఫిక్స్ చేసింది. ఇందుకోసం కలెక్టర్ల నేతృత్వంలో రెండు మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తొలుత ఈ నెల 15న రివిజన్ కమిటీ సమావేశం కానుంది.

రెండో సమావేశం ఈనెల 23న నిర్వహించనుంది. మార్కెట్ ధరలను జాయింట్ కలెక్టర్లు, డివిజనల్ ఆఫీసర్లు, జడ్‌పి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయిస్తాయి. రివ్యూ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఈనెల 26న ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తాయి. జనవరి 1న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ధరలు ఏమేర పెంచాలనే అంశంపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుని నూతన మార్కెట్ రేట్లను ప్రకటించనుంది. ఇందుకోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వం లక్ష్యాలను నిర్ణయించింది. డిసెంబరు -24 నుంచి 2025 మార్చి (నాలుగు నెలలు) కాలానికి రూ.4,792.50 కోట్లు ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబరు నెలకు రూ.1089.09 కోట్లు, జనవరి నెలకు రూ.1012.58 కోట్లు, ఫిబ్రవరి నెలకు 1215కోట్లు, మార్చి నెలకు రూ.1485 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. 2024 - 25 సంవత్సరానికి రూ.13,500 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.6,292.75 కోట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరింది. ఓవరాల్‌గా చూస్తే 46.61శాతంగా వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది.

మార్కెట్ ధరలను నిర్ణయించేందుకు మార్గదర్శకాలు

అర్బన్ ఏరియాలో జాయింట్ కలెక్టర్లు ఛైర్మన్‌గా, మెంబర్లుగా మునిసిపల్ కమిషనర్, వైస్ ఛైర్మన్, జడ్‌పి సిఇఓ, ఒక మెంబరుగా వ్యవహరించనున్నారు. ఆయా భూముల మార్కెట్ విలువను నిర్ధారించే ప్రాంతానికి సంబంధించి కన్వీనరుగా సబ్ రిజిస్ట్రార్ వ్యవహరించనున్నారు. రూరల్ ప్రాంత విషయానికి వస్తే ఆర్‌డిఓ ఛైర్మన్‌గా, మెంబర్లుగా మండల రెవెన్యూ ఆఫీసరు (ఎమ్ఆర్ఓ), ఎంపిడిఓ, డిఆర్/ఎస్ఆర్ (ఎంది అండ్ ఆడిట్)లు ఉండనున్నారు. కన్వీనరుగా సబ్ రిజిస్ట్రార్ వ్యవహరించనున్నారు.

గెలాక్సీ ఎస్24 అల్ట్రా ఆవిష్కరణ

గురుగ్రామ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసినట్లు తెలిపింది. అసమాన భద్రతతో పాటు మూడేళ్ల వారంటీతో వీటిని అందిస్తున్నట్లు పేర్కొంది. ఏడేళ్ల వరకు ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్, సెక్యూరిటీ మెయింటెనెన్స్ హామీ ఇస్తున్నట్లు పేర్కొంది. గెలాక్సీ ఎస్24 ధరలు రూ.78,999 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. 8జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజ్ ఎంపిక ఉంటుందని పేర్కొంది.

అలహాబాద్ హైకోర్టు జడ్జి శేఖర్ కుమార్‌పై
అభిశంసన తీర్మానానికి ప్రతిపక్షాలు సిద్ధం

న్యూఢిల్లీ : ఇటీవల విహెచ్‌పి కార్యక్రమంలో వివాదస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ దిశగా ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాయి. స్వతంత్ర ఎంపి, సీనియర్ న్యాయవాది కపిల్‌సిబాల్ ఈ అభిశంసన తీర్మానం కోసం రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు వేరువేరుగా నోటీసులు పంపనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ నోటీసులను అంద చేస్తామని ఒక ప్రతిపక్ష ఎంపి మీడియాకు తెలిపారు. 'మేం ఉభయ సభలకు నోటీసులు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటి వరకూ రాజ్యసభ నుంచి దాదాపు 40 మంది, లోక్‌సభ నుంచి 100 మందికి పైగా ఎంపీలు నోటీసుపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎంపిలను కపిల్ సిబాల్ సంప్రదిస్తున్నారు' అని చెప్పారు. తీర్మానంపై రాజ్యసభ నుంచి కనీసం 50 మంది, లోక్‌సభ నుంచి 100 మంది ఎంపిలు సంతకం చేస్తే తీర్మానం నోటీసును ఆమోదిస్తారు.

పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

- బహుజన టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 12వ పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెబ్రోలు శరత్ చంద్ర, సౌపాటి రవి కోరారు. సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించేలా కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుపరుస్తూ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించి జనవరి జీతంతో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)
E PROCUREMENT TENDER NOTICE
NIT No. MAU61-USI0INFR(OTH)/24/2024-HB/2nd Call **Dt. 11-12-2024**
Name of Work : "Formation of BT Road on South side of the Siddartha college flyover at East end, Kanuru, Vijayawada" Estimate Cost: **Rs.6.20 Lakhs.** The bid can be downloaded on AP e-procurement portal **from 12-12-2024 to 27-12-2024 up to 14.00 Hrs.** Due date for submission of Bids **27-12-2024 up to 15.00 Hrs, Technical bid opening 27-12-2024 @16.00Hrs.**
For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**
Sd/-Commissioner, APCRDA, Vijayawada

Form No.3
(See Regulations-15 (1) (a) / 16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayana Bhawan, Dabagardens, Visakhapatnam-530020
Case No.O.A/1059/2024
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993
State Bank of India **Exh No.595**
Vs
Ms SS Paper Mart
To,
D1 Ms SS Paper Mart Katamareddy Venkata Lakshmi
D/W/S/o Katamareddy Venkata Lakshmi
M/s SS Paper Mart Rep by its Proprietrix, Smt Katamareddy Venkata Lakhsmi, D.No.25-22-34, VIP Road, KVP Colony, Guntur-522004, Guntur.
D2 1.Smt Katamareddy Venkata Lakshmi
Prop Ms SS Paper Mart, D.No.29-73-2-19, Near KK Towers, Brodipet, Guntur-522004, Guntur.
SUMMONS
WHEREAS, **Case No.OA/1059/2024** was listed before Hon'ble Presiding Officer/ Registrar on **13-12-2024.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.30,78,781.98 Ps** (application along with copies of documents etc. annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you the defendants are directed as under:
(i) to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in theordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institution holding security interest over such assets.
you are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on **13-12-2024 at 10.30 A.M.** failing the application shall be heard and decided in your absence.
The defendants should appear before this Tribunal on 13/12/2024
Given under my hand and seal of this tribunal on this date: **13/11/2024**
Signature of the Officer Authorised to issue summons
Assistant Registrar, Debts Recovery Tribunal, Visakhapatnam

ఇ- వేలం నోటీసు
(వరద నీటితో పాడైన ఎలక్ట్రానిక్ ఐటములు మరియు ఉపకరణాలు)
"లంప్ సమ్" ఆధారంగా వరద నీటికి పాడైన **మెసెర్స్.జివిఆర్ఎస్ అసోసియేట్స్‌కు** చెందిన ఎలక్ట్రికల్ ఐటములు మరియు ఉపకరణాలు ఖచ్చితంగా సాల్వేజ్ విషయం "ఎక్కడ ఉంది", "ఏది ఎక్కడ ఉంది" మరియు "కంప్లెయింట్ లేకుండా" ఆధారంగా ఉద్దేశించబడిన కొనుగోలుదారులను ఇ-వేలంలో పాల్గొనేందుకు ఆహ్వానించడమైనది. షెడ్ నం.10, దర్గా ప్లాట్స్, వినాయక ఎలక్ట్రానిక్స్ ఎదురుగు, ఐరన్ యార్డ్స్, భవానీపురం, విజయవాడ, హైదరాబాద్-520012 వద్ద, **12.12.2024 నుండి 19.12.2024, ఉ.10 గం. నుండి సా.5 గం.ల** మధ్య మాత్రమే మెటీరియల్స్ తనిఖీ నిర్వహించబడును. తనిఖీ కొరకు దయచేసి **శ్రీ.దిలీప్-9248444171** ను సంప్రదించగలరు.
ఇ-వేలం 20.12.2024న నిర్వహించబడుతుంది
ఇ వేలం యొక్క షరతులు మరియు నిబంధనలతో కూడిన ఫారంను పొందేందుకు దయచేసి **శ్రీ.షంషేర్ సింగ్-9709709992** ను సంప్రదించగలరు లేదా వెబ్‌సైట్ : **https://www.sealthedeal.co.in/.** నుండి డౌన్లోడ్ చేసుకోగలరు.
వేలం నిర్వహించువారు : సీల్ ది డీల్, నమోదిత కార్యాలయం : షాప్ నం.148, పాకెట్ సి2, సెక్టార్ 5, రోహిణి, ఢిల్లీ-110085.
ఫారం మరియు ఇఎమ్‌డి డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పణ కొరకు చివరి తేది : 19.12.2024

अखिल भारतीय आयुविंजान सस्यान असारी नगर नडे दिल्ली -110029
ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అన్సారీ నగర్ న్యూ ఢిల్లీ-110029
परीक्ष अनुभाग
పరీక్ష విభాగం
विजापन क्रमाक.157/2024
ప్రకటన నెం: **157/2024**

No.F.AIIMS/Exam.Sec./4-11/LSR/SU-Jan-25)/2024 **తేదీ: 29.11.2024**

విషయం: AIIMS న్యూ ఢిల్లీ కొరకు జనవరి, 2025 సెషన్‌కు సీనియర్ రెసిడెంట్స్ /సీనియర్ డెమోన్‌స్ట్రేటర్స్ పోస్ట్ కోసం రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రెసిడెన్సీ స్కీమ్ ప్రకారం, గరిష్టంగా 3సంవత్సరాల వరకు సీనియర్ రెసిడెంట్స్/సీనియర్ డెమోన్‌స్ట్రేటర్‌ల పదవీకాల పోస్టుల కోసం భారతీయ పౌరుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి. ఈ పోస్టులలో ఇప్పటికేఉన్న ఖాళీ పోస్టులు, బ్యాక్‌లాగ్ ఖాళీలు మరియు 01.01.2025 నుండి 30.06.2025 మధ్య ఖాళీగా ఉండే (స్టేజ్-1) పోస్టులు ఉన్నాయి. పోస్టుల వివరాలను www.aiimsexamsac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అర్హతగల అభ్యర్థుల ఇంటర్వ్యూ (స్టేజ్-11) తర్వాత మాత్రమే పరీక్ష ఆన్‌లైన్ (సిబిటి) విధానంలో నిర్వహించబడుతుంది.

దరఖాస్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీ	
రిజిస్ట్రేషన్ ప్రారంభం	29.11.2024 (శుక్రవారం)
రిజిస్ట్రేషన్ ముగింపు	13.12.2024 (శుక్రవారం) (సా.5:00 వరకు)
సిబిటి ప్రవేశ పరీక్ష తేదీ	
28.12.2024 (శనివారం)	ఉ.10:00గం.ల నుండిఉ.11:30గం.లు

ముఖ్యమైనది: ప్రాస్పెక్టస్, వివరణాత్మక సమాచారం మొదలైనవాటి కోసం దయచేసి www.alimsexams.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. దరఖాస్తుదారులందరూ వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలి, ఎందుకంటే అన్ని తదుపరి సవరణ/అనుబంధం/అప్‌డేట్‌లు వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయబడతాయి.

AIIMS Exams
cbc 17112/12/0045/2425
సం/-
అసిస్టెంట్ కంట్రోలర్ (ఎగ్జామ్స్)

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ కార్యాలయం : నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్న సలై, చెన్నై-600002.
(సెక్షన్ రూల్ 8 (1) క్రింద) స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
ఏదైతే, దిగువసంతకందారు అయిన మెస్సర్స్. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీఎన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క (రూల్ 3)తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. సదరు నోటీసు రసీదు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీలను పిలువడమైనది. రుణగ్రహీతలు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ఈ క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దిగువసంతకందారు సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూలు 8 తో చదువుతూ సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడమైనది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు మెసెర్స్.ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ ఆస్తి (స్థిరాస్తి) వివరణ	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనతా తేది
1.	శాఖ : విజయవాడ లోన్ ఎకౌంట్ నెం.: **SEVJAWD0378948** రుణగ్రహీతలు: శ్రీ.బానాల విజయ సారథి, సహ రుణగ్రహీత- శ్రీమతి. బానాల చందన	గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, చిర్రావూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న డో.నం.జి5/1ఎ లో రెసిడెన్షియల్ ఇల్లు మొత్తం ఆ భాగాలు మరియు పార్సిళ్లు బేరింగ్ ప్రస్తుత మూల్యాంకనం నం.1143032231, పాత డో.నం.1-76, కొత్త డో.నం.25-1-76, కొలత 145.2 చ.గ.లు. లేదా 121.40 చ.మీ.లు. క్రింది విధమైన హద్దులు : ఉత్తరం : మొండితోక ఆంటోని ఆస్తి హద్దు, దక్షిణం : సర్కార్ రోడ్డు, తూర్పు : క్రాకట్ట, గ్రామ పంచాయతీ కాలువ, పడమర : బానాల అశోక్ కుమార్ ఆస్తి. కొలతలు : గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు మంగళగిరి సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉన్న కొలత 145.2 చ.గ.లు. లేదా 121.40 చ.మీ.లు.	22-02-2024 & 1014432	09-12-2024

తేది : 12.12.2024, ప్రదేశం : గుంటూరు **అధీకృత అధికారి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

AXIS BANK LIMITED
రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002
రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
ఏదైతే, క్రింది సంతకందారుడు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తేశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1.	**జిఎస్ఎమ్ ఇన్‌ఫ్రా,** జిఎస్ఎమ్ ఇన్‌ఫ్రా డో.నం.3 8 పరిటాల గ్రామం, కంచికచెర్ల మండలం కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521180 ఇండియా. **(రుణగ్రహీత/తనఖాదారు)** **ద్రోనాదుల దుర్గా కోటేశ్వరి,** భర్త. డి.వంశీ కృష్ణ, డో.నం.3 9 1, కంచికచెర్ల మండలం, పరిటాల, కృష్ణ, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-521180 **(సహ రుణగ్రహీత)** **డిమాండ్ నోటీసు తేది :** 29.04.2024 **లోన్ అకౌంట్ నెం.: UER006908201839**	**22.11.2022** నాటికి ఉన్న బకాయి మొత్తం **రూ.23,94,000/-** (ఇరవై మూడు లక్షల తొంభై నాలుగు వేల రూపాయలు మాత్రమే)	**షెడ్యూల్-ఎ : వెహికల్ :** టాటా మోటార్స్ ఎల్‌టిడి-టిప్పర్-సిగ్న 2823 రిజి.నం.: **AP39TX0304-PR,** ఇంజన్ నం.:**B56B6A220D06112F63870354** చట్రం నం.: **MAT797025M3F13114** లాంఛనప్రాయ స్వాధీనత : 06-12-2024
2.	**జిఎస్ఎమ్ ఇన్‌ఫ్రా,** జిఎస్ఎమ్ ఇన్‌ఫ్రా డో.నం.3 8 పరిటాల గ్రామం, కంచికచెర్ల మండలం, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521180, ఇండియా **(రుణగ్రహీత/తనఖాదారు)** **ద్రోనాదుల దుర్గా కోటేశ్వరి,** భర్త. వంశీకృష్ణ, డో.నం.3 9 1, కంచికచెర్ల మండలం, పరిటాల, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-521180 **(సహ రుణగ్రహీత)** **డిమాండ్ నోటీసు తేది :** 30.05.2024 **లోన్ అకౌంట్ నం.: CER006906295530**	**13.07.2021** నాటికి ఉన్న బకాయి మొత్తం **రూ.32,52,805/-** (ముప్పై రెండు లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల ఐదు రూపాయలు మాత్రమే)	**షెడ్యూల్-ఎ : వెహికల్ :** టాటా మోటార్స్ లిమిటెడ్-టిప్పర్- సిగ్న 2823 రిజి.నం.:**AP39TX0304-PR,** ఇంజన్ నం.:**B56B6A220D06112F63870354** చట్రం నం.: **MAT797025M3F13114** లాంఛనప్రాయ స్వాధీనత : 06-12-2024

తేది : 12.12.2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया / Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి. -520001. Email: arb.vijayawada@unionbankofindia.bank
స్వాధీనత ప్రకటన
షెడ్యూలు 6, రూలు 8(1) (స్థిర/చరాస్తిపై)
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (2వ) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరి బ్రాంచి(79170), విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీతలు : మెస్సర్స్ కళ్యం టెక్స్‌టైల్స్ లిమిటెడ్,** ఎన్‌హెచ్-5, చౌడవరం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522019, **తరుపున మేనేజింగ్ డైరెక్టర్: శ్రీ పోలూరి వెంకటేశ్వరరెడ్డి, తండ్రి: పోలూరి రామిరెడ్డి(లేటు),** ఫ్లాట్ నెం.401, లక్ష్మీ గ్రాండ్ అపార్టుమెంట్, 4వ లైను, శ్యామలానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006, మరియు **2. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్: శ్రీ గుర్రం వెంకట కృష్ణారెడ్డి, తండ్రి: గుర్రం అప్పిరెడ్డి,** ఫ్లాట్ నెం.406, క్రిశాల్స్ కౌంటి, 12వ లైను, శ్యామలానగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006, గార్లను బకాయి సొమ్ము **రూ.185,35,71,199.66 (అక్షరాల నూట ఎనభైఐదు కోట్ల ముప్పైఐదు లక్షల డెబ్బైఒక్క వేల నూట తొంభై తొమ్మిది రూపాయలు మరియు పైసలు అరవై ఆరు మాత్రము)** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.11-09-2024న డిమాండు నోటీసు జారీచేయడమైనది.**
కావున మీరు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం **రూ.80,33,001.56 పై॥ (అక్షరాల ఎనభై లక్షల ముప్పైమూడు వేల ఒక్క రూపాయి మరియు పైసలు యాభైఆరు మాత్రమే)** మీరు అమలు చేసిన లోన్ డాక్యుమెంట్ల నిబంధనలు మరియు షరతుల ప్రకారం కాంట్రాక్చువల్ రేటుతో తదుపరి జమకూడు వడ్డీ మరియు ఛార్జీలు ఈ నోటీసు తేదీ నుండి **60 దినముల లోపల** పైన నుదహరించిన మొత్తము మరియు వడ్డీ కలిపి చెల్లించవలసినదిగా కోరటమైనది. లేనియెడల బ్యాంకువారు పైన పేర్కొనబడిన చట్టం ద్వారా పొందిన ఏదైనా లేదా అన్ని హక్కులను అమలు చేయడం ద్వారా పైన పేర్కొన్న ఆస్తులను వినియోగించరాదు.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏవిధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

SARFAESI చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

గమనిక : సెక్షన్ 13(2) ప్రకారం పూర్వం **ది.29-01-2024 న జారీచేసిన డిమాండ్ నోటీసును ఉపసంహరించడమైనది.**

స్థలం : విజయవాడ
తేది: 06-12-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS — Translating Dreams into Reality

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచి చిరునామా: 7-2-41/బి, గ్రౌండ్ ఫ్లోర్, భవనం వారి వీధి, గంగానమ్మపేట, తెనాలి-522201. ఫోన్: 08644-225838, 9731451228.

స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం ప్రకటన

అనుబంధం -(రూల్ 9(1) కి సంబంధించిన నిబంధనలు చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని ప్రొవిసో రూల్ 9(1)తో చదవబడిన ఫైనాన్షియల్ అసెస్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ కింద స్థిరాస్తుల విక్రయానికి సంబంధించిన సేల్ నోటీసు.

క్యాన్ఫిన్ హోమ్స్ లిమిటెడ్, తెనాలి బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి తీసుకున్న భౌతిక స్వాధీనాన్ని సురక్షిత రుణదాతకు దిగువ వివరించిన స్థిరాస్తి తనఖాగా/ఛార్జ్ చేయబడిందని సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత మరియు హామీదారు(లు)కి నోటీసు ఇవ్వబడింది. 11-12-2024న రూ.33,73,228/-(రూ.ముప్పై మూడు లక్షల డెబ్బై మూడు వేల రెండు వందల ఇరవై ఎనిమిది రుపాయిలు మాత్రమే) రికవరీ కోసం "ఉన్నట్లుగానే" బ్రాంచ్‌లో విక్రయించబడుతుంది. కాన్ఫిన్ హోమ్స్ లిమిటెడ్ కారణంగా, **శ్రీ చుక్కపల్లి శరత్ & శ్రీమతి చుక్కపల్లి నర్మద** (రుణగ్రహీత) నుండి 30-12-2024 నాటికి తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి. రిజర్వ్ ధర రూ.29,00,000/- (ఇరవై తొమ్మిది లక్షలు మాత్రమే) మరియు డబ్బు డిపాజిట్ రూ.2,90,000/- (రెండు లక్షల తొంభై వేలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

1వ ఐటెం: గుంటూరు జిల్లా, తెనాలి జిల్లా రిజిస్ట్రార్, తెనాలి పడమర సబ్ జిల్లా, అంగలకుదురు గ్రామ పంచాయతి ఏరియా, అంగలకుదురు గ్రామం, డి.నెం.267/3, డోర్.నెం.2-49 లో మొత్తం 327.22 చ.గ.ల స్థలంలో 32.72 చ.గ.ల అవిభాజ్యపు మరియు అనిశ్చితపు ఇంటి స్థలం ఈ దిగువ హద్దులలో **తూర్పు:** 24 అడుగుల వెడల్పు ఉమ్మడి దారి, **దక్షిణం:** గడ్డిపాటి యశ్వంత్ గారి ఆస్థి, **పడమర:** 24 అడుగుల వెడల్పు ఉమ్మడి దారి, **ఉత్తరం:** ఉన్నవ శేషుబాబు గారి ఆస్తి.

2వ ఐటెం: 1200 చ.అ.ల గడ్డిపాటి ఎన్‌క్లేవ్ ఆర్.సి.సి రూఫ్ అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులో 150 చ.అ.ల కామన్ ఏరియా మరియు 100 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియాతో అన్ని సులభ హక్కులతో గల 1వ ఐటెం మొదలగునవి ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఈ ఫ్లోట్ యొక్క కారిడార్, **దక్షిణం:** జి.సాంబశివరావు గారి ఫ్లోట్ నెం.203, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** ఓపెన్ టూ స్కై.

భారం: NIL

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతులు క్యాన్ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధికారిక వెబ్‌సైట్‌లో అందించబడ్డాయి. దయచేసి క్రింది లింక్‌ను చూడండి https://www.canfinhomes.com/searchauction.aspx.

ఇ-వేలంలో పాల్గొనడానికి లింక్ :https://sarfaesi.auctionger.net

తేది : 11-12-2024
స్థలము : తెనాలి
సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

- కేజ్రీవాల్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ : ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆమాద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోమారు చెప్పారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆమాద్మీ పార్టీ తన సొంత బలంతోనే బరిలోకి దిగుతుందని అని పునరుద్ఘాటించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆప్ పార్టీ రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

పంజాబ్, హర్యానాల్లో ఎన్ఐఎ సోదాలు

న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. స్థానిక రౌడీ మూకలకు ఉగ్రవాదులకు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయనే అభియోగాలకు సంబంధించిన కేసు (గ్యాంగ్‌స్టర్– టెర్రర్ నెక్సస్ కేసు) దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు చేపట్టారు. పంజాబ్‌లో 8 ప్రదేశాల్లో, హర్యానాలో ఒక చోట ఎన్ఐఎ ఈ సోదాలు నిర్వహించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఎ దర్యాప్తు కొనసాగిస్తోంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో టెర్రర్ గ్యాంగ్‌స్టర్ దవీందర్ బాంబిహా సిండికేట్ సహచరులతో సంబంధమున్న వారి ఇళ్లల్లోనూ ఎన్ఐఎ గత నెలలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

సిసోడియాకు ఊరట

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు మద్యంపాలసీ కేసులో సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. ఈ కేసులో ఆయనకు విధించిన బెయిల్ షరతులను సడలించింది. ఈమేరకు బుధవారం సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సిసోడియా ఇకపై వారంలో రెండుసార్లు దర్యాప్తు సంస్థల ఎదుట హాజరుకావాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే కేసు విచారణకు మాత్రం హాజరు కావాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా, ఈ కేసులో సీనియర్ న్యాయవాదులైన అభిషేక్ మను సింఘ్వీ, న్యాయవాది వివేక్‌జైన్ కోర్టులో సిసోడియా తరపున వాదనలు వినిపించారు. ప్రతి సోమ, గురువారాల్లో సిసోడియాకు పోలీసుల ముందు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోర్టును అభ్యర్థించారు. సిసోడియా ఇప్పటికే దాదాపుగా 60 సార్లు హాజరయ్యారని, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారెవరికీ ఇలాంటి షరతు లేదని న్యాయవాదులు కోర్టులో తెలిపారు. వీరి వాదనలు విన్న జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ బిఆర్ గవాయ్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం సిసోడియా బెయిల్ షరతులను సడలించింది. లిక్కర్ స్కామ్ కేసులో షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. వారంలో రెండు రోజులు అంటే ప్రతి సోమ, గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విచారణకు హాజరు కావాలని, ఆ అధికారికి రిపోర్ట్ చేయాలని షరతు ఉంది. ఇప్పుడు ఆ షరతును సుప్రీంకోర్టు సడలించింది.

కేరళపై కేంద్రం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎపికి జగన్ ప్రభుత్వ హయాంలో రుణ పరిమితులు విధించని కేంద్రం, కేరళకు మాత్రం విధించిందని చెప్పారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో వందల మంది మరణించడంతో పాటు వేలకోట్ల ఆస్తి నష్టం జరిగిందని, అయినా జాతీయ విపత్తు నిధి నుంచి కేరళ రాష్ట్రానికి కేంద్రం రూపాయి కూడా సహాయం చేయలేదన్నారు. కేరళ సహకార వ్యవస్థను ధ్వంసం చేసి సహకార రంగాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేందుకు కేంద్రం నేషనల్ మల్టీస్టేట్ కో–ఆపరేటివ్ విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని, దీనిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన చట్టాలను ఆమోదించకుండా గవర్నర్ ద్వారా అడ్డుకుంటూ ఆ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రతిఘటించి కేరళ ప్రజలకు సంఘీభావంగా నిలవాలని ఆయన కోరారు.

ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కట్టబెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... మోడీ, అమిత్‌షా చేతిలో తోలుబొమ్మలుగా ఉన్నారని విమర్శించారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేయలేదని తమిళనాడుకు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో కూడా అమలు చేస్తున్న రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి పి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘాల కార్యదర్శి ఎం హరిబాబు ప్రసంగించారు.

తివారీ అంతిమయాత్రలో పాల్గొన్న బృందాకరత్, తపన్‌సేన్, నీలోత్పల్ బసు, బి వెంకట్ తదితరులు

కార్మిక పోరాట యోధునికి తుది వీడ్కోలు

- ఢిల్లీలో ముగిసిన తివారి అంత్యక్రియలు
- బృందాకరత్, తపన్‌సేన్ ప్రభృతుల నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మిక వర్గం కోసం జీవిత చరమాంకం వరకు పోరాడిన యోధుడు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కెఎం తివారీకి పార్టీ కార్యకర్తలు, ప్రజలు, బంధువులు తుది వీడ్కోలు పలికారు. ఢిల్లీలో మంగళవారం మరణించిన తివారీకి బుధవారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సందర్శనార్థం తొలుత ఆయన భౌతికకాయాన్ని సిపిఎం ఘజియాబాద్ జిల్లా కమిటీ కార్యాలయంలోనూ, అనంతరం ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లోనూ ఉంచారు.

ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, డిఎస్ఎంఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, ఆర్ఎస్‌పి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వందలాదిగా తరలివచ్చి ప్రజా ఉద్యమనేతకు నివాళులర్పించారు. ఆ తర్వాత నిగంబోధ్ ఘాట్‌కు వరకు అంతిమయాత్ర సాగింది. దారిపొడవునా ప్రజా నీరాజనాలతో ఈ యాత్ర సాగింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తపన్‌సేన్, అశోక్ ధావలే, నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు కె హేమలత, మరియం ధావలే, కె రాధాకృష్ణన్ (ఎంపి), ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, మురళీధరన్, ఎఆర్ సింధు, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఎంపి వి శివదాసన్ తదితరులు ఘనంగా నివాళులర్పించి ఉద్యమ సహచరుడికి తుది వీడ్కోలు పలికారు.

సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం

తివారీ మృతి పట్ల సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం తెలిపాయి. నిబద్ధత కలిగిన ఉద్యమకారుడిగా తివారీ జీవితం యువ తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాయి. దేశ రాజధానిలో విప్లవోద్యమానికి తివారీ మరణం తీరని లోటు అని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్ సేన్, ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

కేరళలో 'చికెన్ ఆన్ వీల్'

- అందుబాటు ధరల్లో ఆరోగ్యకర మాంసాహారం
- కుడుంబశ్రీ మరో వినూత్న ప్రాజెక్టు ఆవిష్కరించిన వామపక్ష ప్రభుత్వం

శీతలీకరణ చికెన్ ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి రాజేష్

తిరువనంతపురం : ప్రజలే ముందు విధానాలతో వినూత్న పథకాలను ఆవిష్కరిస్తున్న కేరళలోని వామపక్ష ప్రభుత్వం తాజాగా 'చికెన్ ఆన్ వీల్' పేరుతో సరికొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. స్వయం సహాయక సంఘాలతో ఏర్పడిన 'కుడుంబశ్రీ' ద్వారానే ఈ ప్రాజెక్టును కూడా అమల్జేయనున్నారు. ఈ పథకం కింద తాజా కోడి మాంసం, గుడ్లు, తదితర ఉత్పత్తులతో పాటు శీతలీకరించిన విలువ ఆధారిత చికెన్ ఉత్పత్తులు (చికెన్ డ్రమ్ స్టిక్స్, బోన్ లెస్ బ్రెస్ట్, చికెన్ బిర్యానీ కట్, చికెన్ కర్రీ కట్, ఫుల్ చికెన్ వంటివి) ప్రజల వద్దకే ప్రత్యేక వాహనాలు ద్వారా విక్రయించనున్నారు. మార్కెట్‌లోకి తీసుకురానున్న శీతలీకరణ మాంసాహార ఉత్పత్తులను కేరళ స్థానిక సంస్థల శాఖ మంత్రి రాజేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి తాము 'కేరళ చికెన్' ప్రాజెక్టు ద్వారా ఆరోగ్యకరమైన మాంసాహారాన్ని, గుడ్లను కుడుంబశ్రీ ద్వారా ప్రజలకు అందుబాటు ధరలకే అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు 'చికెన్ ఆన్ వీల్' పేరుతో తాజా మాంసాహారాన్ని, గుడ్లను, ఫ్రోజెన్ ఉత్పత్తులను ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజల చెంతకే తీసుకెళ్లే పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ పథకం కింద కుడుంబశ్రీ సభ్యులు నేరుగా పౌల్ట్రీ రైతుల వద్దకు వెళ్లి కోళ్లను, గుడ్లను సేకరిస్తారని, వాటిని కుతత్తుకులంలోని భారత మాంసాహార ఉత్పత్తుల సంస్థకు చేర్చి అక్కడ ప్రాసెస్ చేసి నేరుగా వినియోగదారులకు చేరవేస్తారని తెలిపారు. అన్ని మాంసాహార ఉత్పత్తులపై క్యుఆర్ కోడ్ ఉంటుందని, దీనివల్ల ఏ ఉత్పత్తి ఏ పౌల్ట్రీ నుంచి వచ్చిందన్న సంగతి కూడా వినియోగదారులు తెలుసుకోవచ్చునని, దీనివల్ల తాము ఆరోగ్యకరమైన మాంసాన్ని స్వీకరిస్తున్నామన్న భరోసా ప్రజలకు లభిస్తుందని తెలిపారు. తొలి దశలో త్రిసూర్, ఎర్నాకులం, కొట్టాయం, పథమిట్ట జిల్లాల్లో వీటిని విక్రయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు పి గౌరి, సతీదేవి తదితరులు పాల్గొన్నారు. 2019లో ప్రారంభించిన 'కేరళ చికెన్' ప్రాజెక్టు కింద ఇప్పటికే 431 బ్రాయిలర్ కోళ్ల పెంపకం కేంద్రాలను నెలకొల్పారు. 11 జిల్లాల్లో 139 అవుట్ లెట్లు పనిచేస్తున్నాయి.

2035 నాటికి భారత్ సొంత అంతరిక్ష కేంద్రం

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : భారత్ 2035 నాటి కల్లా తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని సిద్ధం చేసుకోనుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష శాఖ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపే దిశగా దేశ అంతరిక్ష రంగం ముందడుగు వేస్తోందని ఆయన తెలిపారు. ఏడాది ప్రగతిపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పారు. 'చంద్రునిపై భారతీయ వ్యోమగామిని దింపాలనే ప్రణాళికలతో అంతరిక్ష పరిశోధనలో ప్రధాన మైలురాళ్లను సాధించడానికి సిద్ధంగా ఉంది. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకుంటుంది. అంతరిక్ష కేంద్రాలు కలిగివున్న అమెరికా వంటి దేశాల సరసన త్వరలో భారత్ నిలవనుంది' అని ఆయన తెలిపారు. అత్యంత త్వరలోనే భారత్ గగన్‌యాన్ మిషన్ చేపట్టనుందని, అలాగే తొలి మానవ సహిత డీప్ ఓషన్ మిషన్ సముద్రయాన్‌లో భాగంగా మత్స్య–6000 జలాంతర్గామిని రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ నౌకను చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఒటి) అభివృద్ధి చేసిందన్నారు. ఇది ప్రారంభమైతే దేశ తొలి మానవ సహిత సముద్ర అన్వేషణ మిషన్‌గా దీనికి గుర్తింపు దక్కనుందని పేర్కొన్నారు.

పక్షపాత ధోరణితో జగదీప్ ధన్‌ఖర్

- నిబంధనలకు విరుద్ధగా రాజకీయాలతో సభ నడుపుతున్నారు
- అందుకే ఆయనను తొలగించేందుకు అవిశ్వాసం
- విలేకరుల సమావేశంలో ప్రతిపక్షాలు

ధన్‌ఖర్ - ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలతో సభ నడుపుతున్నారని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఆయన నిబంధనల కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకే జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం ఇచ్చామని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. బుధవారం నాడిక్కడ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ప్రతిపక్ష నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. ధన్‌ఖర్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారని, అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నేతలను సభలో మాట్లాడకుండా తరచూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. "ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ బద్ధంగా రెండోది. ఇంతవరకు ఉపరాష్ట్రపతి పదవి నుండి తొలగించే తీర్మానం ఎన్నడూ తీసుకురాలేదు. ఎందుకంటే గతంలో అధికారంలో ఉన్న వారందరూ ఎప్పుడూ రాజకీయంగా లేరు. కానీ నేడు పార్లమెంటులో రాజకీయాలు జరుగుతున్నాయని చెప్పవలసి వచ్చింది. మేము నిరాశ చెందాం. అధికార పార్టీ సభ్యులు మాట్లాడినప్పుడు జోక్యం చేసుకోరు. అదే ప్రతిపక్ష సభ్యులు మాట్లాడితే వెంటనే జోక్యం చేసుకుంటారు. కొన్నిసార్లు తనను తాను ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తినని పేర్కొంటారు. నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారు" అని ఖర్గే అన్నారు. "సభా నాయకుడు మాట్లాడినప్పుడు ఎంత అవకాశం ఇస్తారో, ప్రతిపక్షనేతగా తాను మాట్లాడినప్పుడు కూడా అంతే అవకాశం ఇవ్వాలి. అదే రూల్ చెబుతోంది. కానీ ఛైర్మన్ అలా చేయరు. అతని ప్రవర్తన దేశ గౌరవాన్ని దెబ్బతీసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఆయన అలాంటి పరిస్థితిని తెచ్చిపెట్టారు. అందుకే అవిశ్వాసం తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది' అని అన్నారు. 'ప్రతిపక్ష పార్టీలను బహిరంగంగా విమర్శించి, అధికార పక్షానికి అధికార ప్రతినిధిలా ప్రవర్తించే ఉపరాష్ట్రపతి మన చరిత్రలోనే తొలిసారి చూస్తున్నాం. గత మూడేళ్లుగా క్లిష్టమైన సమస్యలను లేవనెత్తడానికి సమయం ఇవ్వకుండా, సీనియర్ సభ్యులను సైతం తక్కువ చేసి మాట్లాడారు" అని ఖర్గే అన్నారు. "1952 నుండి ఉప రాష్ట్రపతి ఎన్నడూ రాజకీయాలలో పాల్గొనలేదు. అందుకే ఉపరాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ఆర్టికల్ 67 కింద తీసుకురాలేదు" అని అన్నారు.

నిష్పాక్షపాతంగా వ్యవహరించాలి: బికాష్ రంజన్ భట్టాచార్య

రాజ్యసభ ఛైర్మన్ నిష్పాక్షపాతంగా వ్యవహరించాలని, రాజ్యాంగ పరిషత్ చర్చలో కూడా ఇదే స్పష్టం చేశారని సిపిఎం రాజ్యసభ ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య పేర్కొన్నారు. ఛైర్మన్ ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని, ఆర్ఎస్ఎస్‌ను కీర్తిస్తున్నాడని విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని సంతోషంగా తీసుకురావటం లేదని, దుఃఖంతోనే తీసుకువస్తున్నామని అన్నారు. అయితే రాజ్యాంగం దాడికి గురవుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలకమైన తరుణంలో తాము అలా చేయవలసి వచ్చిందని అన్నారు. ఛైర్మెన్ అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకే ఈ తీర్మానానికి సిపిఎం మద్దతు ఇచ్చిందని తెలిపారు.

ఆయన సర్కస్ నడుపుతున్నారు: సంజయ్ రౌత్

ఛైర్మన్ ధన్‌ఖర్ నడుపుతున్నది రాజ్యసభను కాదని, సర్కస్ అని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ధ్వజమెత్తారు. 'నేను నలుగురు ఛైర్మన్‌లను చూశాను. కానీ నేను ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి చూడలేదు" అని అన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకే : మనోజ్ ఝా

ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా మాట్లాడుతూ ప్రజాస్వామ్య రక్షణ కోసమే తమ పోరాటమన్నారు. "మా ఈ ప్రయత్నం ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదు. కానీ ఒక సంస్థ ఆలోచనలు, మాటలు, చర్యలలో దాని ప్రవర్తనను పునరుద్ధరించే ప్రయత్నం" అని అన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి దెబ్బ': తిరుచ్చి శివ

డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ సభలో ధన్‌ఖర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామినికి దెబ్బ అని అన్నారు. ఆయన ధోరణి అధికార పక్షానికి అనుకూలంగా ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫౌజియాఖాన్ (ఎన్‌సిపి), జావేద్ అలీఖాన్ (ఎన్‌సిపి), సర్ఫరాజ్ అహ్మద్ (జెఎంఎం), నదిముల్ హక్ (టిఎంసి), సంతోష్ కుమార్ (సిపిఐ), కె.ఎం మణి (కేరళ కాంగ్రెస్), జాన్ బ్రిట్టాస్ (సిపిఎం) తదితరులు మాట్లాడారు.

ప్రతిపక్షాల వినూత్న ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపడుతుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

సజావుగా నడపండి : స్పీకర్‌కు రాహుల్ వినతి

పార్లమెంటులో తనపై బిజెపి ఎంపీలు చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కోరారు. బుధవారం పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ, బిజెపి సభ్యులు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని. స్పీకర్‌ను తాను కోరానని అన్నారు. సభ సజావుగా జరగాలన్నదే మా లక్ష్యం. చర్చ జరగాలి. బిజెపి నాయకులు తనకు వ్యతిరేకంగా ఏమైనా చెప్పనీయండి. డిసెంబర్ 13న రాజ్యాంగ చర్చ జరగాల్సిందే. వాళ్లు అదానీపై చర్చకు ససేమిరా అంటున్నారు. వాళ్లు మాపై ఆరోపణలు చేసుకోనీయండి, కానీ సభ మాత్రం జరగాలని రాహుల్ అన్నారు.

'ద్రోహి' వ్యాఖ్యలపై ప్రియాంక ఫైర్

కాగా, రాహుల్ గాంధీని 'ద్రోహి' అంటూ సంబిత్ పాత్ర సంబోధించడాన్ని ప్రియాంక గాంధీ తప్పుపట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలను సైతం ద్రోహులుగా మాట్లాడిన వ్యక్తులు రాహుల్ గాంధీని విడిచిపెడతారని తాము అనుకోలేమని, వాళ్లకు ఇదేమీ కొత్త కాదన్నారు. ప్రభుత్వమే అంతరాయం కలిగించడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు.

పెరిగిన విద్యుత్ బిల్లులు దహనం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పోర్టును స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టును వైజాగ్ స్టీల్ ప్లాంట్ భూముల్లో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రెండు వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెన్షన్లు, ఉపాధి కల్పనలో కోతలు పెట్టేందుకు సర్వే చేస్తున్న విషయం బయటపడిందని, ఇది సరైంది కాదని తెలిపారు. గ్రామ సభలు జరిపి అనర్హులుంటే తొలగించాలి తప్ప, అధికారులతో సర్వే చేసి కోతలు పెట్టకూడదని హితవు పలికారు.

విశాఖలో మహా కుంభకోణం

విశాఖ పోర్టులో డ్రగ్స్ షిప్‌ను పట్టుకున్న సిబిఐ ఇప్పుడు ఆ షిప్‌లో ఏమీలేదని తేల్చడం వెనుక మహా కుంభకోణం దాగి ఉందని వి.శ్రీనివాసరావు అన్నారు. మోడీ మాయలో పడి ఆ షిప్‌ను వదిలేశారా? అని ప్రశ్నించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. రేషన్ బియ్యం టన్నుల కొద్దీ కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి అక్రమంగా తరలిపోతున్నాయని పట్టుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం... ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదన్నారు. రాజకీయంగా హడావుడి చేస్తున్నారు తప్ప, ఒక్కరినీ అరెస్టు చేయకపోవడం వెనుక ఇంకో కుంభకోణానికి టిడిపి కూటమి నాయకులు పాల్పడినట్టు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు పదేపదే వస్తున్నా ఉక్కు కర్మాగారంపై మాట్లాడడం లేదన్నారు. మూడు నెలలుగా జీతాల్లేక ఉక్కు కార్మికులు ఇబ్బందులు పడుతున్నా ఆయనకు పట్టడం లేదని తెలిపారు.

సేవకుల్లా పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. గత పాలకులు పోర్టులు, సెజ్‌లు కూడా కబ్జా చేశారని, ఒకొక్క దానిని సరిదిద్దుతున్నామని చెప్పారు. కొన్నిసార్లు ఫలితాలు వెంటనే రాకపోవచ్చని, అలా అని నిరుత్సాహ పడకుండా పనిచేస్తే ఎప్పటికైనా అనుకున్నది సాధిస్తామని అన్నారు. పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేసి కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు చేస్తున్నారని, ఇటువంటి అక్రమ కార్యక్రమాలను నియంత్రించేందుకు అవసరమైతే పిడి యాక్ట్‌ను కూడా వినియోగించాలని అన్నారు.

13న విజన్-2047 ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర విజన్ -2047ను ఈనెల 13న ఆవిష్కరిస్తున్నట్లు సిఎం చెప్పారు. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ స్థాయిలో విజన్ రూపొందించామని, దానికి అనుగుణంగానే పాలన సాగాలని అన్నారు. 15శాతం వృద్ధి రేటును లక్ష్యంగా పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు ఫలితాలు రాబట్టాల్సి ఉంటుందన్నారు. 2022–23లో విశాఖపట్టణం జిడిపిఎస్ రూ.1,19,268 కోట్లు ఉండగా, అది 2028–29 నాటికి రూ.2,64,78 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

అరుదైన లోహాలను కొల్లగొట్టేందుకు

మోడీ సర్కార్ కసరత్తు

- దిండిగల్ సభలో ప్రకాశ్ కరత్ విమర్శ

చెన్నయ్ : దేశ ప్రజలపై భారాలు మోపుతూ, ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ దేశంలోని బడా కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమల్జేస్తోందని సిపిఎం సమన్వయకర్త, పొలిల్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. దేశంలో అత్యంత అరుదైన ఖనిజాలను కూడా భూగర్భం నుంచి వెలికి తీసి ఆ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ సిద్ధమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మదురైలో టంగ్‌స్టన్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వితీసి బడా కార్పొరేట్లకు కోట్లవర్షం కురిపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్యాచరణ ప్రకటించిందని, ఈ దుర్మార్గమైన విధానాన్ని ప్రజలందరూ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మదురైలో అరుదైన టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాలను చేపట్టాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించడాన్ని కరత్ ఈ సందర్భంగా స్వాగతించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి తదితర నాయకులు పాల్గొన్నారు.

'సంభాల్' బాధితులతో రాహుల్ సమావేశం

న్యూఢిల్లీ : సంభాల్ హింసాకాండ బాధితులు, వారి కుటుంబాలతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని రాహుల్ నివాసం 10 జన్‌పథ్‌లో ఈ సమావేశం జరిగింది. వయనాడ్ ఎంపి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిజెపి విద్వేష రాజకీయాల ఫలితంగానే సంభాల్ ఘటన జరిగిందని, ఇలాంటి ఘటనలు శాంతియుత సమాజానికి ప్రాణాంతకమని విమర్శించింది. ఇలాంటి హింసాత్మక, ద్వేషపూరిత మనస్తత్వాన్ని మనమంతా కలిసికట్టుగా ప్రేమ, సోదరభావంతో ఓడించాలని పిలుపునిచ్చింది. బాధితులందరికీ తాము అండగా ఉంటామని, వారికి న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేసింది. నవంబర్ 24న ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో హింసాకాండ చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ నెల 4న సంభాల్‌లో బాధితుల్ని పరామర్శించడానికి వెళుతున్న రాహుల్, ప్రియాంకలను ఘాజీపూర్ సరిహద్దు వద్ద ఉత్తరప్రదేశ్ పోలీసులు అడ్డుకున్న సంగతి విదితమే.

కాబూల్‌లో ఆత్మాహుతి పేలుడు

- తాలిబన్ మంత్రి సహా ముగ్గురు మృతి

కాబూల్ : ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో బుధవారం ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో తాలిబన్ శరణార్థుల వ్యవహారాలు చూసే మంత్రి, మరో ఇద్దరు మరణించారని హోం శాఖ అధికారులు తెలిపారు. శరణార్థుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలోనే ఈ పేలుడు చోటు చేసుకుందని, మంత్రి ఖలీల్ హక్కాని చనిపోయారని తెలిపారు. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. మూడేళ్ళ క్రితం తాలిబన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బాంబు దాడితో ఉన్నత స్థాయిలోని వ్యక్తి మరణించడం ఇదే. ఈ పేలుడుకు కారణమెవరనేది వెంటనే తెలియరాలేదు. తాలిబన్‌లో శక్తివంతమైన నెట్‌వర్క్‌కు సారథ్యం వహించే తాత్కాలిక హోం మంత్రి సిరాజుద్దీన్ హక్కానికి ఖలీల్ హక్కాని బంధువే.

సిరియాలోకి చొచ్చుకెళ్తున్న ఇజ్రాయిల్

(మొదటి పేజీ తరువాయి)

నివారించేందుకే ఈ చర్యలని చెప్పారు. అసద్ పంథాను ఎవరు అనుసరించినా వారికి అసద్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. గత 48గంటల్లో 350కి పైగా వైమానిక దాడులకు ఇజ్రాయిల్ పాల్పడింది. సిరియాలోని వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేసేశామని తెలిపింది. తీవ్రవాదుల చేతుల్లోకి ఆ ఆయుధాలు వెళ్ళకూడదనే ఉద్దేశంతోనే ఈ దాడులు జరిపామంటూ సమర్ధించుకుంది. సిరియా నావికాదళానికి చెందిన రెండు నౌకాశ్రయాలపై ఒకేసారి క్షిపణి నౌకలతో దాడి చేశామని మిలటరీ తెలిపింది. సిరియాలో అసద్‌ను పదవీచ్యుతుణ్ణి చేసిన తర్వాత ఏర్పాటు చేసే 'సాల్వేషన్ గవర్నమెంట్'కు మహ్మద్ అల్ బషీర్ సారథ్యం వహిస్తారని హెచ్‌టిఎస్ నేత అబూ మహ్మద్ జొలాని ప్రకటించారు.

దేశాన్ని పునర్నిర్మిస్తాం : తాత్కాలిక ప్రధాని హామీ

సిరియాను మొత్తంగా పునర్నిర్మిస్తామని తాత్కాలిక కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బషీర్ హామీ ఇచ్చారు. అయితే నగదు సంక్షోభం తీవ్రంగా వుందని వ్యాఖ్యానించారు. లక్షల సంఖ్యలో ఉన్న శరణార్థులందరినీ వెనక్కి రప్పిస్తామని చెప్పారు. పౌరులందరికీ రక్షణ కల్పిస్తామని, మౌలిక సేవలందిస్తామని హామీ ఇచ్చారు. విదేశీ కరెన్సీ కొరత చాలా తీవ్రంగా వున్నందున కష్టం కాగలదన్నారు. 35వేల సిరియన్ పౌండ్లు పెడితే ఒక్క డాలరును కొనుగోలు చేయగలమని చెప్పారు. ఇక రుణాలు, బాండ్ల గురించి డేటా సేకరిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా అయితే పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుందన్నారు.

అమెరికా, ఇజ్రాయిల్ కుట్రలకు అసద్ బలి : ఇరాన్ అధినేత ఖమేని



అమెరికా, ఇజ్రాయిల్ ఒక పథకం ప్రకారమే అసద్ ప్రభుత్వాన్ని కూల్చివేశాయని ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని బుధవారం వ్యాఖ్యానించారు. సిరియా పొరుగుదేశాల్లో ఒకరికి కూడా ఇందులో పాత్ర వుందన్నారు. ఆ దేశం పేరును ఆయన వెల్లడించలేదు. అయితే అసద్ వ్యతిరేక రెబెల్స్‌కు మద్దతిచ్చే టర్కీ గురించే ఆయన ఈ ప్రస్తావన చేసినట్లు కనిపిస్తోంది.

"సిరియాలో చోటు చేసుకున్న పరిణామాలన్నీ అమెరికా, ఇజ్రాయిల్ కమాండ్ రూమ్‌ల్లో రచించిన పథకం ప్రకారమే జరిగాయనడానికి మా దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. సిరియా పొరుగు ప్రభుత్వం కూడా ఇందులో పాలు పంచుకుంది." అని ఖమేని తెలిపారు.

అసద్ ప్రభుత్వం కూలిపోయిన గంటల వ్యవధిలో ఇరాన్ స్పందిస్తూ దూరదృష్టితో, వివేచనా దృక్పథంతో కూడిన సంబంధాలను డమాస్కస్‌తో కొనసాగించాలని భావిస్తున్నట్లు వ్యాఖ్యానించింది. సిరియా సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించేలా ప్రభుత్వ ఏర్పాటు జరగాలని పిలుపునిచ్చింది.

మీకోసం
ప్రెషర్ కుక్కర్ గ్యాస్కెట్ వదులైతే దాన్ని మూడురోజులు ఫ్రిజ్‌లో ఉంచాలి.

జీవన సౌరభం
విజయాల నుంచే కాదు, అపజయాల నుండీ ఎదగడం నేర్చుకోవాలి.

చిన్ని ఆలస్యానికి అసలు కారణం

ఎప్పటిలాగానే ఆరోజు కూడా చిన్ని బడికి ఆలస్యంగా వెళ్ళింది. చిన్ని వాళ్ళ టీచర్ ఆలస్యానికి గల కారణం తెలుసుకోకుండా చిన్నిని కొట్టారు. ఆరోజు ఆదివారం చిన్ని ఎప్పటిలాగే అనారోగ్యంతో ఉన్న వాళ్ళమ్మను జాగ్రత్తగా చూసుకొని అన్నం పెట్టి పనికి బయలుదేరింది. చిన్ని వాళ్ళ అమ్మకు, చిన్ని పనికి వెళ్లడం ఏ మాత్రం ఇష్టం లేదు. కానీ తన అనారోగ్యం వల్ల ఏమీ చేయలేకపోయేది. ఒకరోజు టీచర్ చిన్ని వాళ్ల ఇంటివైపు వెళ్లారు. ఆ సమయంలో తను ఇంటి దగ్గర లేదు. చిన్ని వాళ్ళ అమ్మ అనారోగ్యంతో మంచం మీద ఉండడం టీచర్ చూశారు. ఇంతలో చిన్ని పని దగ్గర నుండి ఇంటికి వచ్చింది. రోజూ అమ్మకి సాయం చేసి, చిన్ని స్కూలుకు వస్తుందని టీచర్ తెలుసుకున్నారు. ఆరోజు నుంచి తన పట్ల ఎంతో ప్రేమగా ఉన్నారు. పాఠశాలలో అల్లరి చేసే పిల్లలకి చిన్నిని ఒక ఉదాహరణగా చూపిస్తున్నారు.

– ఎం.లాస్య,
5వ తరగతి,
అరవింద హై స్కూలు ,
కుంచనపల్లి.

బాలలం- భావి భారత పౌరులం

అమ్మనాన్నల చిరునవ్వులం
ఇంటిలో వెలిగే దివ్వెలం
తాతయ్య, బామ్మలకు ఆనందాల మూటలం
ఇంటిలో తిరిగే అల్లరి పిడుగులం
పిల్లలం మేము భావి భారత పౌరులం.

రెక్కలు కట్టుకొని ఆకాశంలో ఎగురుతాం
నీటిలో చేపల్లా ఈదుతాం
చక్కగా కబుర్లెన్నో చెబుతాం
కోపం వస్తే మూతి ముడుచుకుంటాం
పిల్లలం మేము భావిభారత పౌరులం.

వానలో చిందులేస్తాం
బడంటే మారాం చేస్తాం
ఆటలంటే ఎగిరి గంతులేస్తాం.
పుస్తకాలతో కుస్తీ పడతాం
ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తాం
బాలలం మేము భావిభారత పౌరులం.

– చింతా రాంబాబు,
కాత్రేనికోన,
99481 78092.

నేను గీసిన బొమ్మ

ఎ.సోని,
6వ తరగతి,
జడ్పీ స్కూల్ రాంపూర్,
నిజాంపేట మండలం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్వీయ రక్షణపై అవగాహన

అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడుల గురించి నిత్యం వింటూనే ఉంటున్నాం. చాలా సందర్భాల్లో తెలిసిన వారి నుంచే పిల్లలు ఇలాంటి వేధింపులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లలకు తమ శరీరం గురించి అవగాహన కల్పించటం చాలా అవసరం. శరీరానికి సంబంధించి కొన్ని నియమాలు ఉంటాయని పిల్లలకు తెలియాలి. వాటిని ఇతరులు అతిక్రమిస్తున్నప్పుడు స్పందించటమే కాదు. తక్షణం వ్యతిరేకించటమెలాగో నేర్పించాలి. సరిగ్గా ఇదే పని చేస్తున్నారు 'ఆ నలుగురు'. చిన్నారులు, ఆడపిల్లలను కాపాడేందుకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పైనా అవగాహన కల్పించటం ఎంతో అవసరం. తద్వారా ఇలాంటి ప్రమాదాల బారినుంచి పిల్లలను కాపాడొచ్చు. నవ్వుతూ తుళ్లుతూ స్కూళ్లకు వెళ్లే ఆడపిల్లల పట్ల కొన్ని కళ్లు చూపులతోనూ, మరికొన్ని చేతలతోనూ ఆ నవ్వులను చిదిమేయడానికి పొంచివుంటాయి. అందుకే పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి తెలియజేయాలి.

స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. నేటి ఆడపిల్లే రేపటి వెలుగు. ఆడపిల్లలను కాపాడుకుందాం... అంటూ కాట్రగడ్డ స్వరూపరాణితో కలిసి 'ఆ నలుగురు' కదం తొక్కారు. ఆడపిల్లకు ఇంటా బయటా వేధింపులు నిత్యకృత్యమవుతుండటాన్ని వారు చూడలేకపోయారు. సమాజానికి తమ వంతుగా ఏదో ఒకటి చేయాలని భావించారు. 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై అవగాహన కల్పించటానికి పూనుకున్నారు. దీనికి అమరావతి బాలోత్సవ కమిటీ తోడ్పాటును ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి.

విజయవాడకు చెందిన బండి స్వాతి, తమ్మిరి రత్నాంబిక, తుమ్మల దుర్గాభవాని, చెన్ను ప్రసన్న స్నేహితురాళ్లు. తమ వృత్తి, ఉద్యోగాలు చేసుకుంటూనే తమకు వీలున్న సమయంలో సమాజానికి ఏదో ఒక సాయం చేయాలని భావించారు. ఎంబి విజ్ఞానకేంద్రం సభ్యురాలు కాట్రగడ్డ స్వరూపరాణి ఈ నలుగురిని బాలోత్సవ్ కమిటీలో రిసోర్స్ పర్సన్లుగా చేర్పించారు.

అవగాహన ముఖ్యం

ఆడపిల్లల భవిత బాగుండాలంటే వారు సురక్షితంగా ఉండాలి. చెడు చేతల బారిన పడకుండా పాఠశాలలు, మురికివాడలు, అపార్ట్‌మెంట్లు తదితర చోట్ల అవగాహన కల్పించాలి. మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆ పై వయస్సు పిల్లలు కూడా ఎదురు చెప్పలేని, ఎదుర్కోలేని స్థితిలో ఉన్నారు. పిల్లల ప్రవర్తనలో తేడాలు గమనిస్తే నిపుణుల సాయం తీసుకోవటం ఉత్తమం.

అవగాహనతో అరికట్టగలం

యునిసెఫ్ లెక్కల ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా 53 శాతం బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయి. 90 శాతం కుటుంబ సంబంధీకులు, ఇరుగుపొరుగువారే ఈ దాడులకు తెగబడుతున్నారు. ఆడపిల్లల అమ్మకాలు పెరిగాయి. మత్తు, మద్యం వినియోగం, అశ్లీల చిత్రాలు, సోషల్ మీడియాలో వస్తున్న అసభ్య దృశ్యాలు బాల బాలికలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇలాంటి వేధింపులకు గురయ్యే పిల్లల్లో 1. ఆకలి తగ్గిపోవటం 2. ఎవరితో కలవకపోవటం 3. నిద్రలో ఉలిక్కిపడి లేవడం 4. ప్రతి విషయానికి చికాకు పడటం 5. చదువులో వెనుకబడిపోవటం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఆ లక్షణాలు గుర్తించినప్పుడు ఆ పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడి, ఆ పరిస్థితి నుంచి బయటపడేలా తోడ్పాటు అందించాలి.

'నో' చెప్పటం అలవాటు చేయాలి

ఎవరైనా అమ్మాయిల తలపై, వీపుపై తట్టడం వంటి స్పర్శ వారిపై శ్రద్ధగానే అనిపిస్తుంది. కానీ, వారి శరీరంలోని ప్రయివేటు పార్టులను తడమడం, తాకడం, కొట్టడం వంటివి చేస్తే, తీవ్రమైన చెడు ప్రభావాన్ని చూపుతాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సరే వారు స్పర్శించిన తీరును బట్టి ఉద్దేశాన్ని గుర్తించేలా పిల్లలకు తర్ఫీదునివ్వాలి. నచ్చకపోతే వెంటనే 'నో' చెప్పాలని పిల్లలకు తెలియజేయాలి. ఎవరైనా అలా ప్రవర్తిస్తున్నట్టు అనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని చెప్పాలి. నో చెప్పటం, గట్టిగా అరవడం, భద్రత కోసం అక్కడి నుంచి మనుషులు ఉన్నచోటకు రావడం, ఎవరి సహాయమైనా తీసుకోవడం చేయాలని చెప్పాలి. సంఘటనను బట్టి వెంటనే ప్రతిఘటించాలి. కుటుంబసభ్యులతో ఎలాంటి బాధనైనా పంచుకోవాలి. ఎవరికీ చెప్పుకోలేని సమస్య ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1098 లేదా 100కు ఫోన్ చేయాలి. ఇలాంటి విషయాలను ఈ మిత్రబృందం వివిధ పాఠశాలలకు వెళ్లి, విద్యార్థినులకు వివరిస్తున్నారు. ఆ ప్రయత్నం మంచి ఫలితాలను ఇస్తుందని తాము భావిస్తున్నట్టు స్వరూపరాణి చెప్పారు.

డెమోలతో అవగాహన

'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. వారితోనే డెమోలు సైతం చేయిస్తున్నాం. కథల్లాగా కూడా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. వేరే వారి సమక్షంలో సురక్షితంగా అనిపించకపోతే గట్టిగా అరవటం, కొరకడం, నెట్టేయడం వంటివి ఎలా చేయాలో కూడా వివరిస్తున్నాం. ఎలా రక్షించుకోవాలనే ఆలోచనను పిల్లల్లో కల్పించడానికి వీలైనన్ని కాన్సెప్ట్స్ ఇస్తున్నాం. పిల్లల చేతనే బాడీలో ఏయే పార్ట్స్ తాకితే బ్యాడ్ టచ్ అనే విషయాలను తెలియజేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాల్లో పిల్లలు వాళ్ల ఎక్స్‌పీరియన్స్‌ను షేర్ చేసుకోవటం, తాము ఎలా ప్రతి స్పందించాలో ఒక్కొక్కటిగా చెబుతుంటే ఆనందంగా అనిపిస్తుంది.

శానిటరీ ప్యాడ్లను ప్రతి 8 గంటలకు ఒకసారి మార్చాలనే విషయాన్ని కూడా తెలియ జేశాం. 11 సంవత్సరాల వారు హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వేసుకోవాల్సిన అవసరాన్ని గురించీ వివరించాం.

- బండి స్వాతి, బాలోత్సవ కమిటీ.

చాలా కేసులు వెలుగులోకి వస్తున్నాయి

ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 'బాలికలు, మహిళలపై హింసను నిర్మూలిద్దాం' పేరుతో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ 16 రోజులపాటు పాఠశాలల స్థాయిలో పలు కార్యక్రమాలను చేపట్టాం. గుడ్‌టచ్... బ్యాడ్ టచ్‌ను ఎలా ఎదుర్కోవాలో తెలియజేశాం. బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలికల హక్కులు, ఫోక్సో చట్టం గురించి కూడా వివరించాం. బాలికలపై వేధింపులను ఎలా ఎదుర్కోవాలనే పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుండగా పిల్లలు చాలా విషయాలు చెప్తున్నారు. ఇప్పటికే చాలామంది లైంగిక దాడులకు గురైన వారు కూడా ఉన్నారని మేము గమనించాం. ప్రభుత్వాలు కూడా బాలికల రక్షణ నిమిత్తం పాఠశాల స్థాయిలో కరాటే, కుంగ్‌ఫూ వంటివి నేర్పించాలి.

- కాట్రగడ్డ స్వరూపరాణి, బాలోత్సవ కమిటీ.

మోహన్‌బాబుకు హైకోర్టులో ఊరట

- పోలీసులు ఇచ్చిన నోటీసులపై స్టే
- విచారణకు హాజరయ్యేందుకు 24 వరకు మినహాయింపు
- మీడియాకు మంచు మనోజ్ క్షమాపణలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సీనియర్ నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన కుమారుడు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇచ్చిన నోటీసులపై బుధవారం హైకోర్టు స్టే విధించింది. రాచకొండ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యేందుకు ఈ నెల 24 వరకు మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణ వరకు మోహన్‌బాబు ఇంటి వద్ద పరిస్థితిని పర్యవేక్షించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణకు హాజరుకావాలన్న పోలీసుల నోటీసులపై బుధవారం హైకోర్టులో మోహన్‌బాబు, ఆయన మరో కుమారుడు విష్ణు లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. మంచు మనోజ్ బౌన్సర్లను తీసుకొచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నారని మోహన్‌బాబు తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. "కుటుంబ విషయాలను మీడియాలో పెద్దదిగా చేసి చూపిస్తున్నారు. మోహన్‌బాబు అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా పోలీసులు నోటీసులిచ్చారు. రక్షణ కల్పించాలని ఈ నెల 9న పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినా పరిగణనలోకి తీసుకోలేదు. పోలీసులు ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలి" అని కోర్టును కోరారు. పరస్పర ఫిర్యాదులపై నమోదైన కేసులు కాకుండా.. జర్నలిస్టుపై దాడి చేసినందుకు మోహన్‌బాబుపై మరో క్రిమినల్ కేసు నమోదు చేశామని ప్రభుత్వ న్యాయవాది (జిపి) కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి నోటీసులపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్‌బాబును ఆయన పెద్ద కుమారుడు విష్ణు బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మమ్మల్ని అమితంగా ప్రేమించడమే మా నాన్న చేసిన తప్పు అని అన్నారు. ఇంటి వద్ద జరిగిన దాడిలో ఒక విలేకరికి గాయపడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. అతని కుటుంబంతో మాట్లాడామని.. అవసరమైన సాయం చేస్తామని తెలిపారు. "ప్రతీ కుటుంబంలోనూ ఇలాంటి గొడవలు ఉంటాయి. కాబట్టి, ఈ విషయాన్ని సెన్సేషన్ చేయొద్దు. కొంతమంది హద్దులు మీరి వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తాము ఎవరినీ బాధ పెట్టాలనుకోలేదు. నమస్కారం చేసుకుంటూనే నాన్న మీడియా ముందుకు వచ్చారు. ముఖంపై మైక్ పెట్టగానే క్షణికావేశంలో ఆయన దాడి చేశారు. మా నాన్న స్వయంకృషితో ఎదిగారు. ఇల్లు ఆయన కష్టార్జితం. తన ఇంట్లో ఉండొద్దు అని ఆయన అంటే.. ఉంటాను అనే హక్కు నాకు లేదు" అని విష్ణు తెలిపారు. మీడియాపై దాడికి సంబంధించి మంచు మనోజ్ విలేకరులకు క్షమాపణలు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్తి కోసం తాను గొడవ పడుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని తెలిపారు. కాగా, జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ తెలంగాణాలో పలుచోట్ల జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. మోహన్‌బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మంధాన సెంచరీ వృధా

- చివరి వన్డేలోనూ ఆస్ట్రేలియా మహిళల చేతిలో భారత్ ఓటమి
- వన్డే సిరీస్ 3-0తో ఆసీస్ కైవసం

పెర్త్: ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన మూడో, చివరి వన్డేలోనూ భారత మహిళా జట్టు ఓటమిపాలైంది. ఆసీస్ నిర్దేశించిన 299 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 215 పరుగులకు ఆలౌటైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన(105; 109బంతుల్లో 14ఫోర్లు, సిక్సర్) శతకం వృధా అయింది. హర్లీన్ డియోల్(39) ఫర్వాలేదనిపిం చింది. 35 ఓవర్లకు 3వికెట్లు కోల్పోయి 184 పరుగులతో పటిష్టంగా ఉన్న టీమిండియా అనుహ్యంగా వరుసగా వికెట్లు కోల్పోయి చేజేతులా ఓటమిపాలైంది. ఆష్లీన్ గార్డ్‌నర్ (5/30) భారత్‌ను దెబ్బకొట్టింది. మేగాన్ షట్, అలానా రెండేసి వికెట్ల తోపాటు అన్నాబెల్ ఒక వికెట్ తీశారు. అంతకు ముందు ఆస్ట్రేలియా జట్టులో అన్నాబెల్ సదర్లాండ్ (110) సెంచరీ సాధించగా.. కెప్టెన్ తహ్లియా మెక్‌గ్రాత్(56నాటౌట్), ఆష్లే గార్డెనర్(50) అర్ధ సెంచరీలతో మెరిశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డికి నాలుగు, దీప్తి శర్మ ఒక వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ సథర్లాండ్‌కు దక్కింది.

మంధాన రికార్డు సెంచరీ..

సెంచరీ కొట్టిన మంధాన ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఒక క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు వన్డే సెంచరీలు చేసిన తొలి మహిళా బ్యాటర్‌గా మంధాన చరిత్ర సృష్టించింది. బెలిండా క్లార్క్(1997), మెగ్ లానింగ్(2016), అమీ సాటర్త్‌వైట్(2016), సోఫీ డివైన్(2018), సిద్రా అమిన్(2022), నాట్ సివర్(2023), లారా వోల్వార్డ్(2024) మూడేసి శతకాలు బాదారు. మంధానకు ఇది వన్డేల్లో తొమ్మిదో శతకం. ఈ క్రమంలోనే అత్యధిక సెంచరీలు (9) చేసిన ఆసియా బ్యాటర్‌గా చమరి ఆటపట్టు రికార్డును మంధాన సమం చేసింది.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి)రీచా (బి)అరుంధతి 25, జార్జియా (బి)అరుంధతి 26, ఎలైసా పెర్రి (బి)అరుంధతి 4, మూనీ (సి)రీచా (బి)అరుంధతి 10, సథర్లాండ్ (రనౌట్) జెమిమీ/రీచా 110, గార్డినర్ (సి)మిన్ను మణి (బి)దీప్తి 50, తాహిలా గ్రాత్ (నాటౌట్) 56, మోలినెక్స్ (నాటౌట్) 2, అదనం 15. (50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 298పరుగులు. **వికెట్ల పతనం:** 1/58, 2/60, 3/72, 478, 5/174, 6/296 **బౌలింగ్:** రేణుకా సింగ్ 10-0-54-0, సైమా ఠాకూర్ 6-0-40-0, సద్ధు 10-0-65-0, అరుంధతి రెడ్డి 10-2-26-4, దీప్తి శర్మ 9-0-77-1, మిన్ను మణి 5-0-36-0

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (బి)గార్డినర్ 105, రీచా (బి)స్కట్ 2, హర్లిన్ డియోల్ (సి అండ్ బి)కింగ్ 39, హర్మన్‌ప్రీత్ (సి)గ్రాత్ (బి)సథర్లాండ్ 12, జెమిమా (సి అండ్ బి)మేఘన్ స్కట్ 16, దీప్తి (సి)బెత్ మూనీ (బి)గార్డినర్ 0, మిన్ను మణి (సి)లిచ్‌ఫీల్డ్ (బి)గార్డినర్ 8, అరుంధతి రెడ్డి (ఎల్‌బి)గార్డినర్ 5, సైమా ఠాకూర్ (సి)గ్రాత్ (బి)గార్డినర్ 0, టిటాస్ సద్ధు (సి)గార్డినర్ (బి)కింగ్ 3, రేణుకా సింగ్ (నాటౌట్) 8, అదనం 17. (45.1ఓవర్లలో ఆలౌట్) 215పరుగులు. **వికెట్ల పతనం:** 1/16, 2/134, 3/165, 4/189, 5/189, 6/189, 7/201, 8/201, 9/203, 10/215 **బౌలింగ్:** స్కట్ 7-0-26-2, కిమ్ గ్రాత్ 4-0-22-0, ఎలైసా పెర్రి 4-0-30-0, సథర్లాండ్ 9-0-34-1, గార్డినర్ 10-1-30-5, మోలినెక్స్ 5-0-28-0, మెక్ గ్రాత్ 2-0-15-0, కింగ్ 4.1-0-27-2.

నన్ను అలా పిలవొద్దు

తమిళ హీరో అజిత్ కుమార్ తన అభిమానులకు ఓ విజ్ఞప్తి చేశారు. తనను (కడవులే అజిత్) 'దేవుడు అజిత్' అని పిలవవద్దని తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా స్పెషల్ నోట్ విడుదల చేశారు. 'ఇటీవల మూవీ ఈవెంట్‌లలో లేదా మీటింగ్స్‌లలో నన్ను (కా.. అజితే) 'కడవులే అజిత్' అని పిలుస్తున్నారు. ఈ పిలుపు నాకు ఇబ్బందిగా అనిపిస్తుంది. నేను ఇలాంటివి జీర్ణించుకోలేకపోతున్నాను. దయచేసి ఇలా పిలవడం ఆపండి. నేను నా పేరుతో మాత్రమే పిలవడానికి ఇష్టపడతాను. అజిత్ అని పిలవండి చాలు.. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా కష్టపడి పని చేయండి. మీ ఫ్యామిలీని జాగ్రత్తగా చూసుకోండి, చట్టాన్ని గౌరవించే పౌరులుగా ఉండండి' అన్నారు. అజిత్ ఇంతకుముందు కూడా ఇలాంటి ప్రకటన విడుదల చేశారు. తనను 'తలా' అని పిలవవద్దంటూ గతంలో అభిమానులను కోరారు. సినిమాల విషయానికి వస్తే.. అజిత్ ప్రస్తుతం 'విదా ముయార్చి' సినిమాతో పాటు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే చిత్రంలో నటిస్తున్నారు. 'విదా ముయార్చి' సినిమాకు మాగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయిక నటిస్తున్నారు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాకు 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

విశ్వక్ కొత్త ప్రాజెక్టు 'ఫంకీ'



విశ్వక్‌సేన్ తాజాగా కొత్త ప్రాజెక్ట్‌ను ఓకే చేశారు. 'జాతి రత్నాలు' ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దు కోనుంది. 'ఫంకీ' అనేది సినిమా టైటిల్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఇది సిద్ధం కానుంది. తాజాగా ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. నాగ్‌అశ్విన్ ఈ కార్యక్రమంలో పాల్గొని టీమ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. త్వరలోనే రెగ్యులర్ షూట్ ప్రారంభం కానుంది. ఆషికా రంగనాథ్ కథానాయికగా నటించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. విశ్వక్‌సేన్ ప్రస్తుతం ఆయన రామ్ నారాయణ్ దర్శకత్వంలో 'లైలా' కోసం వర్క్ చేస్తున్నారు. ఇందులోని ఓ సన్నివేశంలో విశ్వక్ అమ్మాయి

ఎఎ22 తాజా అప్డేట్

అల్లు అర్జున్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ లైన్లో పెట్టినట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ డైరెక్షన్‌లో ఈ సినిమా రాబోతోంది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ నిర్మాత ఓ పోస్ట్ పోట్టారు. 'ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అండ్ త్రివిక్రమ్ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అప్‌డేట్ త్వరలో రాబోతుంది. దీనికి సంబంధించిన చిన్న ప్రోమో కట్ 2025 జనవరిలో వస్తుంది. అలాగే ఈ మూవీ షూటింగ్ మార్చి 25 నుంచి స్టార్ట్ కాబోతుంది.. ఎఎ22 కోసం వేచి ఉండలేక పోతున్నా' అంటూ నిర్మాత నాగవంశీ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు.



ఫ్ఛ్.. డ్రాతోనే సరి..

గుకేశ్-డింగ్ చివరి రౌండ్ గేమ్ నేడు
ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్

సింగపూర్: ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌కు మరో రౌండ్ మాత్రమే మిగిలి ఉండగా.. బుధవారం జరిగిన 13వ రౌండ్ గేమ్ డ్రా అయ్యింది. సుమారు 68ఎత్తులపాటు సుదీర్ఘ పోరాటం తర్వాత ఇరువురు గ్రాండ్‌మాస్టర్లు డ్రాకు అంగీకరించారు. తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేశ్ ఈ గేమ్‌లో గెలిస్తే చివరి రౌండ్‌లో కొంత ఒత్తిడి తగ్గి ఉండేది. కానీ ఈ గేమ్ డ్రా కావడంతో గురువారం జరిగే 14వ రౌండ్ గేమ్‌లో గుకేశ్ తెల్లపావులతో ఆడే డింగ్ లెరెన్‌ను చెక్ పెట్టడానికి కష్టపడాల్సి ఉంటుంది. బుధవారం జరిగిన 13వ రౌండ్ గేమ్ డ్రా కావడంతో ఇరువురు 6.5-6.5పాయింట్లతో ఉన్నారు. దీంతో ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్ రసకందాయంలో పడింది. నేడు జరిగే చివరి రౌండ్ గేమ్‌లో గెలిచిన గ్రాండ్‌మాస్టర్‌కు టైటిల్ దక్కనుంది. చివరి రౌండ్ గేమ్‌లో డింగ్ లెరెన్ తెల్లపావులతో, గుకేశ్ నల్లపావులతో ఆడనున్నారు. ఈ గేమ్ డ్రా అయిన పక్షంలో ఫలితం కోసం టైబ్రేకర్ పోటీ జరగనుంది. చివరి 14వ రౌండ్‌తో విజేత ఎవరో తేలిపోనుండగా.. ఫిడే నిబంధనల ప్రకారం 7.5పాయింట్లు సాధించిన తొలి ఆటగాడు విజేతగా అవతరించనున్నాడు. 14వ గేమ్ ముగిసేసరికి 7-7పాయింట్లతో గ్రాండ్‌మాస్టర్లు సమంగా ఉన్న పక్షంలో టైబ్రేకర్‌కు వెళ్లనున్నారు.

సెమీస్‌కు బరోడా, మధ్యప్రదేశ్

- సయ్యద్ ముస్తాక్ అలీ టి20

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్ సెమీఫైనల్లోకి బరోడా, మధ్యప్రదేశ్ జట్లు ప్రవేశించాయి. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో బరోడా జట్టు 41పరుగుల తేడాతో బెంగాల్‌ను, మధ్యప్రదేశ్ జట్టు 6వికెట్ల తేడాతో సౌరాష్ట్ర జట్టును ఓడించాయి. బెంగాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 172పరుగులు చేయగా.. ఛేదనలో బెంగాల్ జట్టు 18ఓవర్లలో 131పరుగులకే కుప్పకూలింది. మరో క్వార్టర్స్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 173పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని మధ్యప్రదేశ్ 19.2ఓవర్లలో 4వికెట్లు నష్టపోయి 174పరుగులు చేసి విజయం సాధించింది.

ఢిల్లీ, ముంబయి కూడా..

ఇతర క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో ఢిల్లీ, ముంబయి జట్లు క్వార్టర్స్‌లో గెలిచి సెమీస్‌కు చేరాయి. ఢిల్లీ జట్టు 19పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్‌ను, ముంబయి జట్టు 6వికెట్ల తేడాతో విదర్భపై విజయం సాధించాయి. ఢిల్లీ 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 193పరుగులు చేయగా.. ఛేదనలో యుపి జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 174పరుగులకు ఆలౌటైంది. ఇక విదర్భ నిర్దేశించిన 221పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబయి జట్టు 19.2ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. ముంబయి జట్టులో పృథ్వీ షా(49), రహానే(84), శివం దూబే(37), షిండే(34) బ్యాటింగ్‌లో మెరిసారు.

13న జరిగే సెమీఫైనల్స్...
బరోడా × ముంబయి(ఉ.11.00గం॥లకు)
ఢిల్లీ × మధ్యప్రదేశ్(సా.4.00గం॥లకు)
(వేదిక: చిన్నస్వామి స్టేడియం; బెంగళూరు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68